# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 110 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 10 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 110 10-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## చల్లటి కబురు .. నేటి నుండి వానలు

అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తీవ్ర ఎండ దెబ్బకు భగభగమంటున్న ఎపి రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. రేపటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఎపిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి వెల్లడించింది. ఈ నెల 11వ తేదీన బంగాళాఖాతంలో

- తరువాయి 2లో..

## ఒక్కొక్క కార్యాలయానికి..

# రూ.10 లక్షలు ఇస్తాం..

- సీఎం చంద్రబాబు
- స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలుకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- 26 జిల్లా, 175 నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటు
- ప్రతి యూనిట్ నిర్వహణకు రూ.10 లక్షలు కేటాయింపు
- నియోజకవర్గ యూనిట్‌కు ఎమ్మెల్యే ఛైర్మన్‌గా 9 మంది సభ్యులతో బృందం
- వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని సీఎం ధీమా
- ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం



అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధన దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ముందడుగు వేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాలు, 175 నియోజకవర్గ కేంద్రాల్లో 'విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్' కార్యాలయాలను సోమవారం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ యూనిట్లు స్వర్ణాంధ్ర విజన్ అమలుకు పటిష్టమైన పునాది వేస్తాయని, శాసనసభ్యులకు ప్రభుత్వపరంగా ప్రత్యేక కార్యాలయాల లోటును తీరుస్తాయని సీఎం పేర్కొన్నారు.

**యూనిట్ల నిర్మాణం - నిధులు**

ప్రతి నియోజకవర్గ విజన్ యాక్షన్ యూనిట్ నిర్వహణకు రూ. 10 లక్షలు కేటాయిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఎమ్మెల్యే అధ్యక్షతన, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కార్యనిర్వహణ ఉపాధ్యక్షులుగా ఈ యూనిట్లు పనిచేస్తాయి. జిల్లా నోడల్ ఆఫీసర్, ఒక విద్యావేత్త, ఒక యువ ప్రొఫెషనల్, గ్రామ/వార్డు సచివాలయాలకు చెందిన ఐదుగురు విజన్ స్టాఫ్ కలిపి మొత్తం తొమ్మిది మంది సభ్యులుంటారు. నియోజకవర్గ కేంద్రానికి చెందిన

- తరువాయి 2లో..

## మహిళలు నిరసన తెలుపుతుంటే 'సంకరజాతి' అంటారా?

### నారా లోకేశ్ ఫైర్

- మహిళలను కించపరిచేలా వైసిపి నేతలు, సాక్షి జర్నలిస్టుల వ్యాఖ్యలపై లోకేశ్ స్పందన
- నిరసన తెలిపిన మహిళలను "సంకరజాతి" అనడంపై తీవ్ర ఆగ్రహం
- "తలపండిన" సాక్షి జర్నలిస్టులు మహిళలను "వేశ్యలు" అన్నారని ఆరోపణ
- మహిళల జోలికి వస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని లోకేశ్ హెచ్చరిక
- జగన్ రెడ్డి తీరునే వైసీపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నారని విమర్శ



అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ పై వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమను అవమానించిన వారి ఫోటోల వద్ద మహిళలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తే, వారిని వైసీపీ నాయకులు 'సంకరజాతి' అని అభివర్ణించడం దారుణమని మండిపడ్డారు. "ఏమిటీ ఈ భాష? ఏమిటీ విపరీత ప్రవర్తన?" అంటూ ఆయన వైసీపీ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల వైసీపీ నాయకులు, సాక్షి మీడియాకు చెందిన కొందరు జర్నలిస్టులు అనుసరిస్తున్న వైఖరిని మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా తప్పుపట్టారు. "తలపండిన సాక్షి జర్నలిస్టులు మహిళలను వేశ్యలు అంటూ అవమానించారు. ఇప్పుడు వైసీపీ నేతలు మహిళల్ని కించపరుస్తూ సంకరజాతి అంటూ దిగజారి మాట్లాడుతున్నారు. మహిళలు అంటే ఎందుకు ఇంత చిన్నచూపు!" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రవర్తన, జగన్ రెడ్డి తన తల్లిని, చెల్లిని తరిమేసిన అమానవీయ తీరును ఆదర్శంగా తీసుకున్నట్లుగా ఉందని ఆయన విమర్శించారు. మహిళల జోలికి వస్తే, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని నారా లోకేశ్ ఈ సందర్భంగా

- తరువాయి 2లో..

## మహిళల ఆత్మగౌరవాన్ని

# దెబ్బతీస్తే ఊరుకోం..



**మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ**

- సాక్షి జర్నలిస్టుల వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం
- ఒక ప్రాంత మహిళలను అవమానించడం, అసభ్య పదజాలం వాడటంపై మండిపాటు
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాతీయ మహిళా కమిషన్, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు
- క్షమాపణ చెప్పకుండా టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని విమర్శ

అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజకీయ నాయకుల అండతో నడిచే కొన్ని మీడియా సంస్థలు సమాజానికి అత్యంత ప్రమాదకరమని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఒక ప్రముఖ మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టులు ఒక ప్రాంత మహిళలను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పదజాలం వాడటంపై ఆమె తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న జర్నలిస్టులు ఇలాంటి అసత్య కథనాలను ఎలా ప్రసారం చేస్తారని ప్రశ్నించారు. విషయాన్ని వివరిస్తూ, "గుంటూరులో 150 ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయని, అవి ఫీమేల్ సెక్స్ వర్కర్స్‌తో రిజిస్టర్ అయి

- తరువాయి 2లో..

## అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఎపి : వైఎస్.జగన్

అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందని, ప్రజాస్వామ్యం, చట్టం, న్యాయం ఖూనీ అయిపోతున్నాయని వైసిపి అధినేత వైఎస్.జగన్ ఆరోపించారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదుల్ని, మేధావుల్ని, జర్నలిస్టుల్ని భయకంపితుల్ని చేస్తున్నారంటూ %ౌ% సోమవారం సోషల్ మీడియా వేదికగా జగన్ ట్వీట్ చేశారు. ఏడాది కాలంగా చంద్రబాబు చేస్తున్న అరాచకపు, అన్యాయ పాలనపై ప్రజల తరఫున వీరెవ్వరూ గొంతెత్తకుండా, ఏడాది తన దుర్మార్గపు పాలన, తన మోసాలు, తన అవినీతి, తన వైఫల్యాలపై స్వరం వినిపించకుండా చంద్రబాబుగా తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అణచివేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. చేయని వ్యాఖ్యలకు 70 ఏళ్ల వఅద్ధుడైన, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసి కక్షసాధింపుల విష సంస్కృతిని పతాక స్థాయికి తీసుకెళ్లారన్నారని మండిపడ్డారు. సహజంగా ఒక డిబేట్ జరిగేటప్పుడు, వక్తలు మాట్లాడే మాటలకు, యాంకర్‌కు ఏం సంబంధం ? సహజంగానే ఓ డిబేట్‌లో వక్తలు కొందరు అనుకూలంగానూ, కొందరు వ్యతిరేకంగానూ మాట్లాడుతూ ఉంటారని.. కొన్ని టీవీ ఛానళ్లలో వ్యక్తిత్వాలను హననం చేస్తూ చాలామంది గెస్ట్‌లు మాట్లాడిన సందర్భాలు గతంలో మనం చూడలేదా ? ఇప్పటికీ కొనసాగడం లేదా ? అని ప్రశ్నించారు. ప్రజల తరఫున మీడియా నిలవకూడదని, చంద్రబాబు చేసిన తప్పులను ప్రశ్నించకూడదని ఒక పథకం ప్రకారం లేని వాటిని ఆపాదిస్తూ, టాపిక్స్‌ను డైవర్ట్ చేస్తూ, వక్రీకరిస్తూ, మీడియాపైనా దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కొమ్మినేనిపై చంద్రబాబు కక్ష కట్టడం ఇది తొలిసారికాదని.. గతంలోనే

- తరువాయి 2లో..

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు

# అస్వస్థత...





నంద్యాల జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ ఇవాళ ఉదయం సొమ్మసిల్లి కిందపడి అస్వస్థతకు గురయ్యారు. నియోజకవర్గ పరిధిలో

- తరువాయి 2లో..

## ప్రకాశం జిల్లాలో

# భూ ప్రకంపనలు

ఒంగోలు జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఒంగోలు: ప్రకాశం జిల్లా ముండ్లమూరు పరిసర ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించింది. అర్ధరాత్రి 12.47 గంటల సమయంలో భూప్రకంపణలు వచ్చాయి. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇంట్లో నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. నాలుగు సెకండ్ల పాటు భూమి కంపించిందని ప్రజలు తెలిపారు. నెల 6న కూడా ప్రకాశం జిల్లా పొదిలిలో భూకంపం వచ్చింది. ఉదయం 9.54 గంటలకు భూమి కంపించింది. సుమారు 5 సెకన్లపాటు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. కొత్తూరులోని రాజు దవాఖాన వీధి, బ్యాంకు కాలనీ, ఇస్లాంపేటలో ప్రకంపణలు వచ్చాయి. అంతకుముందు రోజు సాయంత్రం తెలంగాణలోని (%వశ్రీఖఅస్త్రుఖు% ) పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ( %ఘీతీఅఎఖు-స్త్రుతీ ఇఅర్‌తీఅష్%)3.8 తీవ్రతతో భూ ప్రకంపణలు చోటుచేసుకున్నాయి. గంగాధర, చొప్పదండిలోని వాస గృహాలు, దుకాణ సముదాయాలు, సూపర్‌మార్కెట్లలో సామానులు కిందపడిపోగా, ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, జన్నారం, లక్సెట్టిపేటలో భూమి కంపించింది.

## అడవుల పెంపకానికి కొత్త సలహాదారుడిగా అంకారావు !

అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కే.అంకారావును అడవుల పెంపక సలహాదారుడిగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఎస్. విజయానంద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు ఆయన్ను రెండు సంవత్సరాల కాలానికి అడవుల పెంపకానికి సంబంధించిన ప్రత్యేక సలహాదారుడిగా నియమించడం జరిగింది. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన అంకారావు పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి, తన జీవితాన్ని ప్రకృతి, అడవుల సంరక్షణకు అంకితం చేసుకున్న వ్యక్తి. దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీ పూర్తిచేసినా, ఉద్యోగాన్ని కాకుండా అడవుల సేవనే జీవనంగా ఎంచుకున్నారు. ప్రతి రోజు నల్లమల అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ, చెరువులను శుభ్రపరుస్తూ, పక్షులకు గింజలు వేస్తూ,

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సంపాదకీయం

## చుట్టుముడుతున్న యుద్ధాగ్ని జ్వాలలు

రష్యాతో భారత్ తన సంబంధాలు తెంచుకోవాలని చెప్పడం ద్వారా అమెరికా దాదాపుగా భారత్‌ను హెచ్చరించినట్లుగానే భావించాలి. అమెరికా వాణిజ్య కార్యదర్శి లుత్నిక్ మాటలు డొనాల్డ్ ట్రంప్ మాటలుగానే భావించాలి. రష్యా వద్ద ఆయుధాలు కొనుగోలు చేయడం వాషింగ్టన్‌ను వ్యతిరేకించడమేనన్న అమెరికా వ్యాఖ్యలు అనుచితం. అమెరికా తన ఆర్థిక దివాళాకోరుతనాన్ని ట్రేడ్ డీల్స్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తూ ఇబ్బందిపెట్టాలని చూసిన ట్రంప్‌కు భారత్ కూడా ప్రతీకార సుంకాలతోనే గుణపాఠం నేర్పడానికి సంసిద్ధమైనది. చిరకాల మిత్రులైన భారత్- రష్యాలను విడదీయాలనే దుర్మార్గమైన ఆలోచనకు అమెరికా స్వస్తి చెప్పాలి. ఉగ్రమూకలకు స్వర్గధామమైన పాకిస్తాన్ పట్ల అమెరికా ఉదార స్వభావాన్ని ప్రదర్శించడం సిగ్గుచేటు. ఇటీవల పుతిన్- అజిత్ దోవల్ మధ్య జరిగిన సంభాషణలు అమెరికాకే కాకుండా చైనా, పాక్, బ్రిటన్‌లకు వెన్నులో వణుకు పుట్టించాయి.

ఒక వైపు అమెరికా, బ్రిటన్ మరికొన్ని యూరప్ దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, భారత్‌లో మారణహోమం సృష్టిస్తున్న పాక్‌ను మందలించకుండా భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కు వెన్నుదన్నుగా నిలుస్తున్న పాక్‌ను ఎదిరించేందుకు రష్యాతో ఆయుధ ఒప్పందం కుదుర్చుకుంటున్న భారత్‌పై ఈర్ష్యాద్వేషాలను ప్రదర్శిస్తున్న అమెరికా వైఖరి అసమంజసం. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతం. ఉగ్రవాదులతో, జిహాదీ శిక్షణలో ఎలాంటి అభివృద్ధి సాధించకుండా పిఒకె నిస్తేజంగా మారిపోయింది. పిఒకె ప్రజలకు తినడానికి తిండిలేదు. విద్య, ఉపాధి అవకాశాలు లేవు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్ ఇందుకు విరుద్ధం. కశ్మీర్ ప్రజలు టూరిజంతో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఉగ్రవాదం వలన జీవితాలు ఎంత దుర్భరంగా మారతాయో అక్కడ ప్రజలకు అర్ధమైనది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంత కాలం అలజడులు చెలరేగినా అక్కడ జరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు కశ్మీర్ ప్రజల్లో మార్పును తెచ్చిన మాట కాదనలేని సత్యం. ఎవరో కొద్ది మంది చేసే పనుల వలన కశ్మీర్‌లో ఏదో జరిగిపోతుందనుకోవడం విడ్డూరం. జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని గమనించిన తరువాత పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు కూడా భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. జై శంకర్, యోగి ఆదిత్యనాథ్, రాజ్ నాథ్ సింగ్ వంటి వారు పిఒకె స్వాధీనం గురించి ఇదివరకే తమ అభిప్రాయాలను కుండబద్దలు గొట్టినట్టు చెప్పారు. పిఒకెను భారత్ స్వాధీనం చేసుకుంటుందా? ఇందుకు చైనా, అమెరికాలు అభ్యంతరం చెప్పి, పాక్‌కు ఆయుధాలు సరఫరా చేసి భారత్‌పై యుద్ధానికి ప్రేరేపిస్తాయా? అనే విషయం తేలాలి. రష్యా- ఉక్రెయిన్ల మధ్య గత మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపడం అమెరికాకు చేతకాలేదు. పైగా ట్రంప్‌ను జెలెన్‌స్కీ ప్రత్యక్షంగానే విమర్శించిన విషయం మరవలేం. తన మద్దతు లేకపోతే ఉక్రెయిన్ యుద్ధం చేయలేదని డాంబికాలు పలికిన అమెరికాను సవాల్ చేస్తూ, మునుపెన్నడూ లేని విధంగా రష్యాపై ఉక్రెయిన్ స్పైడర్ వెబ్ ఆపరేషన్‌ను చేపట్టి రష్యాను భయపడేలా చేసింది. రష్యాలోని కీలకమైన క్రిమియా బ్రిడ్జిని ఉక్రెయిన్ కూల్చింది. 41 యుద్ధ విమానాలు, ఒక బ్రిడ్జిని ధ్వంసం చేసి పటిష్టమైన రక్షణ వ్యవస్థ కలిగిన రష్యాకు సవాల్ విసిరిన ఉక్రెయిన్‌కు నాటో దేశాలు సహకారం అందించడం వలన జరిగే మహావిలయాన్ని ఊహించగలమా? రష్యా కూడా ఉక్రెయిన్‌కు చెందిన వందలాది మంది సైనికులను హతమార్చినట్టు ప్రకటించుకుంది. ఉక్రెయిన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా చేసిన హెచ్చరిక ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేం. రష్యాకు యుద్ధంలో సహాయం చేయడానికి ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తం చేసింది. వేలాది సైన్యం, ఆయుధాలతో కిమ్ రష్యాకు అండగా ఉండబోతున్నారు. ఉక్రెయిన్ రష్యాపై ఆకస్మికంగా దాడి చేసి ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయడం అవాంఛనీయ పరిణామంగా భావించాలి. అహం దెబ్బతిన్న రష్యా ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడడానికి సిదంగా ఉంది. రష్యా రిటాలియేషన్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించలేం. ఈ పరిణామాల వలన అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్ పక్షాన నిలబడి భారీ యుద్ధానికి తెరతీసే అవకాశముంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అందరూ భావిస్తున్న తరుణంలో అనుకోని విధమైన మలుపులు తిరుగుతూ ప్రపంచాన్ని భయానకమైన వాతావరణంలోకి నెట్టింది. ఉక్రెయిన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌కు స్పష్టం చేసారు. ఎక్స్ ద్వారా ట్రంప్ ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. భారత్ -రష్యా సంబంధాలను అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. భారత దేశానికి అంతర్జాతీయంగా అన్నివిధాలుగా సహకరిస్తున్న ఏకైక విశ్వసనీయమైన దేశం రష్యా. అలాంటి రష్యాకు మన దేశం ఎంతో రుణపడి ఉంది. 1971లో జరిగిన ఇండో- పాక్ యుద్ధంలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు తెలిపినా, అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు అన్ని విధాలా సాయంచేసి నిజమైన స్నేహానికి నిర్వచనం చెప్పింది. అప్పటి సోవియట్ యూనియన్ నుంచి నేటి రష్యా వరకు భారత్‌కు వెన్నంటి ఉన్న మిత్ర దేశంతో భారత్‌ను వేరుచేయాలని అమెరికా విఫల ప్రయత్నాలు చేస్తున్నది. ఆసియా, ఐరోపా ఖండాల్లో విస్తరించి ఉన్న రష్యా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో ఒక భాగం. కొన్ని దేశాల కుట్రల వలన, మిఖాయిల్ గోర్బచేవ్ విధానాల వలన ఎంతో ఖ్యాతి గాంచిన సోవియట్ యూనియన్ విడిపోయింది. 15 కామన్ వెల్త్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో రష్యా ఒక కీలకమైన దేశం.

సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రష్యా ఈనాటికీ మిగిలిన ప్రాంతాల కంటే అత్యధిక ఆయుధ, సైనిక బలగం గల దేశం. అప్పటి సోవియట్ యూనియన్ మాదిరిగా రష్యా కూడా ఒక అగ్రరాజ్యం. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంగల దేశంగా మైదానాలతో, వ్యవసాయ భూములతో, సహజ వనరులతో తులతూగుతున్న రష్యా అంటే ఈనాటికీ కొన్ని దేశాలకు గిట్టదు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు రష్యాకు బద్ధశత్రువులు. ఇటీవల కాలంలో రష్యాపట్ల స్నేహ వైఖరిని ప్రదర్శించినట్లు నటించిన ట్రంప్ తన దుర్బుద్ధిని చాటుకున్నారు. రష్యా కు భారత్ మరింత సన్నిహితంగా మెలగడం అమెరికాకు నచ్చడంలేదు. అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ట్రంప్ అధికారంలోకి రావడానికి కృషి చేసారు. ఎన్నికల తర్వాత అక్రమ వలసదారుల పేరుతో భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో వారిని భారత్‌కు పంపించి, ఘోరంగా అవమానించాడు. భారత్‌ను ప్రశంసిస్తూ, మోడీ తన మిత్రుడంటూనే అమెరికా అధ్యక్షుడయ్యాక ట్రంప్ భారత్‌కు వెన్నుపోటు పొడిచాడు.

ట్రంప్ చేష్టలను తట్టుకోలేక అతని ఆప్తమిత్రుడైన ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌ను అభిశంసించి, గద్దె దించాలని, జెడి వాన్స్‌ను అధ్యక్ష స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నించడం గమనార్హం. భారత్ విషయంలో కూడా ట్రంప్ ధోరణి సముచితంగా లేదు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా భారత్ తన సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నది. ఈ క్రమంలో రష్యా భారత్‌కు అన్ని విధాలా అండగా ఉంటున్నది. చైనా, పాకిస్తాన్, అజర్ బైజాన్, బంగ్లాదేశ్, టర్కీ వంటి దేశాలు భారత్‌పట్ల అకారణ విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఒకప్పుడు ఇండో- చీనీ భాయ్‌భాయ్ అంటూనే 1962లో భారత్‌తో యుద్ధానికి తలపడి, భారత్ భూభాగాలను ఆక్రమించి చైనా నమ్మకద్రోహం చేసింది. టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు భారత్ ఆశ్రయమివ్వడమనే అంశంతో చైనా భారత్‌తో యుద్ధానికి దిగిందనే వాదనలో పసలేదు.

భారత్ లోని ఈశాన్య ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా నాడు చైనా యుద్ధం చేసింది. చికెన్ నెక్‌గా పిలవబడుతున్న సిలిగురి కారిడార్‌ను వివాదాస్పదం చేసి ఈశాన్య భారతాన్ని మింగేయడానికి డ్రాగన్ దేశం విస్తృతంగా ప్రయత్నిస్తున్నది. భారత భూభాగాలను తమవిగా పేర్లు మార్చుకుంటూ భౌగోళిక పటాలను సృష్టిస్తున్నది. పాక్‌తో అంటకాగుతూ భారత్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తున్నది. ఇక పాకిస్తాన్ విషయం వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పాకిస్తాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పటికీ, భారత్‌ను ఇంకా ఉగ్రవాదంతో ఇబ్బందులకు గురిచేస్తున్నది. భారత్‌లో కశ్మీర్ విలీనం రాజా హరిసింగ్ నేతృత్వంలో చట్టబద్ధంగా జరిగినా కశ్మీర్‌లోని కొంత భూభాగాన్ని పాక్ ఆక్రమించుకుంది. అదే పాక్ ఆక్రమిత కశ్మీర్. పాక్ ఆక్రమిత కశ్మీర్ కేవలం ఉగ్రవాదులకు నిలయం.

ఇక్కడ నుండే ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ కొనసాగిస్తూ, ఎల్ఒసివద్ద కాల్పులు జరుపుతూ, కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి ప్రవేశపెట్టి, భారత్‌లో అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటున్నది. పహల్గాం దారుణ మారణకాండకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పింది. భారత్ ఆయుధ శక్తికి బెంబేలెత్తిన పాక్ కాల్పుల విరమణకు ప్రతిపాదన చేయడంతో భారత్ తాత్కాలికంగా శాంతించింది. అయినప్పటికీ పాక్, పాక్‌కు వత్తాసు పలుకుతున్న శత్రుదేశాల కుయుక్తులనుండి దేశాన్ని కాపాడుకోవడానికి భారత్ తన మిత్రదేశమైన రష్యాతో ఆయుధాల విషయంలో సంప్రదింపులు జరుపుతున్నది. అమెరికాకు భారత్ వైఖరి నచ్చడం లేదు. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ఆపలేని అమెరికా తానేదో భారత్‌ను ట్రేడ్ డీల్ ద్వారా బెదిరించి, దారికి తెచ్చానని చెప్పడం విడ్డూరం. ఏదిఏమైనప్పటికీ వర్తమాన ప్రపంచం యుద్ధాల రూపంలో ఒక పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాట వాస్తవం.

# ఇప్పటికీ వారిలో మార్పు లేదు...

## ఇక ఊరుకోను: మంత్రి నారా లోకేశ్

**నమ్మిన సిద్ధాంతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్న నారా లోకేశ్**

**ఆర్థిక సమస్యలున్నా సంక్షేమ కార్యక్రమాల్లో వెనక్కి తగ్గేదిలేదని వెల్లడి**

**సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళతామని వ్యాఖ్యలు**

**పార్వతీపురం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్**

అమరావతి జూన్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరం ఒక కుటుంబం. కోటిమంది సభ్యులున్న కుటుంబం... కొన్నిసార్లు అనుకున్నవన్నీ జరగకపోవచ్చు... నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. పార్వతీపురం సమీపంలోని చినబొండపల్లిలో టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ.... "ఇప్పటికీ కొందరు అధికారుల్లో మార్పు కన్పించడం లేదు, ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటా, ఇక ఊరుకునేది లేదు... ఉద్దేశపూర్వకంగా టిడిపి కేడర్ ను ఇబ్బంది పెట్టేవారిపై కఠినంగా వ్యవహరిస్తా" అని స్పష్టం చేశారు.

**6 శాసనాలు నరనరాన ఎక్కించాలి**

యువగళం పాదయాత్ర చేసినపుడు మీ ప్రాంతానికి రాలేకపోయా, విశాఖ వరకు వచ్చి ఆగిపోయాను. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్రగా రావాలని భావించా, బాబుగారి అరెస్టు వల్ల ఆపాల్సి వచ్చింది. శంఖారావం కార్యక్రమంలో మీవద్దకు వచ్చా. జిల్లాకు వచ్చినపుడు ఉత్తమ కార్యకర్తలు, కార్యకర్తలను కలుస్తానని ఇచ్చిన హామీమేరకు మీ ముందు నిలబడుతున్నా. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును నిర్దేశిస్తూ ఆరుశాసనాలు ప్రకటించాం. తెలుగుజాతి విశ్వఖ్యాతి, అన్నదాత కు అండగా, యువగళం, స్త్రీశక్తి, సోషల్ రీఇంజనీరింగ్ %-% పేదల సేవలో, కార్యకర్తే అధినేత. ఒకటికి 10సార్లు మాట్లాడి ఈ శాసనాలు పెట్టాం. సామాన్య కార్యకర్త నుంచి పొలిట్ బ్యూరో వరకు ఇదే లైన్ నరనరాన ఎక్కించాలి.

**కార్యకర్తల ఆకాంక్షలమేరకు నేతలు పనిచేయాలి**

ఈరోజు మనం అధికారం పీఠంపై కూర్చోవడానికి కార్యకర్తలే కారణం. కార్యకర్తల ఆకాంక్షల నాయకులు పనిచేయాలి. నమ్ముకున్న సిద్ధాంతం కోసం కేడర్ కష్టపడాలి. సమస్యలుంటే మాట్లాడాలి, పోరాడాలి, సాధించాలి. తల్లికివందనం పథకం కింద త్వరలో ఒకేసారి తల్లుల ఖాతాలో డబ్బు వేస్తున్నాం. సంక్షేమంలో వెనకడుగు వేసేది లేదు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కల్పిస్తున్నాం. గత అయిదేళ్ల విధ్వంసక పాలన వల్ల అన్నీ ఒకేసారి చేయాలంటే డబ్బు మనవద్ద లేదు. దశలవారీగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. గ్రామం, జోనల్, మండలం, జిల్లాస్థాయిల్లో ఎక్కడిక్కడే సమస్యలు పరిష్కరించాలి. సాధ్యం కాకపోతే మా దృష్టికి తేవాలి. పార్టీపై అలిగి ఇళ్లలో కూర్చుంటే రాష్ట్రానికి అన్యాయం చేసిన వారవుతారు.

**అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో లాగే ఉండాలి**

వైసీపీ అధినేత జగన్ ప్రతిపక్షంలో ఉన్నపుడు కూడా బెంగుళూరులో ప్యాలెస్ లో పడుకుంటారు. కార్యకర్తలను కలవరు. ఆయన ఇంటిముందు గేటు 30 అడుగులు కట్టారు. ఓడిపోయాక కార్యకర్తలు లోపలకు వెళ్లకుండా జైలుమాదిరి గేటు కట్టుకున్నాడు. కార్యకర్తలను కలవరు, వారు చెప్పింది వినరు. అధికారంలో ఉన్నా మనం ప్రతిపక్షంలో మాదిరి వ్యవహరించాలి. 10 నిర్ణయాల్లో 3 తప్పు అవుతాయి, సరిచేసుకుంటాం. ఇది మన ప్రభుత్వం, ప్రజాప్రభుత్వం, సంక్షేమం అభివృద్ధిని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళతాం. గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటాం. మీ భవిష్యత్తుకు నాది బాధ్యత. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు, నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల వివరాలిస్తే పార్టీ కార్యాలయం ద్వారా పరిష్కరిస్తాం" అని మంత్రి లోకేశ్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బోనేల విజయచంద్ర, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్య, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక్కొక్క కార్యాలనాయానికి రూ.10 లక్షలు ఇస్తాం..

ఎంపీడీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రజాప్రతినిధులకు సీఎం పిలుపునిచ్చారు.

**స్వర్ణాంధ్ర లక్ష్యాలు - జాతీయ దృక్పథం**

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, రెండేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'వికసిత్ భారత్-2047'కు అనుబంధంగా 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను రూపొందించామని తెలిపారు. పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత వంటి పది సూత్రాలతో కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం గల భారతీయుల్లో 30% తెలుగువారేనని, ఈ ప్రగతిని కొనసాగించాలన్నారు.

**అభివృద్ధి, సంక్షేమ హామీలు**

ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని, 'తల్లికి వందనం' ఈ నెలలోనే ప్రారంభించి, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. దీపం పథకం లబ్ధిదారులకు నేరుగా నగదు జమ చేస్తామన్నారు. పోలవరం 2027 నాటికి, అమరావతి 2028కి, భోగాపురం విమానాశ్రయం 2026 నాటికి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ, విజయవాడల్లో మెట్రో రైళ్లు, విశాఖ రైల్వే జోన్, పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలు వేగవంతం చేస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా, కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు 10 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించగా సీఎం అభినందించారు.

## మహిళలు నిరసన తెలుపుతుంటే 'సంకరజాతి' అంటారా?: నారా లోకేశ్ ఫైర్

హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ఉందని, అలాంటి వారిని కించపరిచేలా మాట్లాడటం సహించరానిదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సజ్జల వ్యాఖ్యల వీడియోను లోకేశ్ పంచుకున్నారు. ఇటీవల సాక్షి టీవీలో ప్రసారమైన ఓ చర్చా కార్యక్రమంలో కృష్ణంరాజు అనే జర్నలిస్టు "అమరావతి వేశ్యల రాజధాని" అంటూ అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే పోలీసులు సాక్షి టీవీ ప్రజెంటర్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు.

## మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం..

పనిచేస్తున్నాయని ఓ జర్నలిస్టు అన్నారు. ఇది పూర్తిగా తప్పు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఇచ్చిన డేటా ప్రకారం ప్రతి జిల్లాలో, ప్రతి ఊరిలో ఎంతమంది ఫీమేల్ సెక్స్ వర్కర్స్ ఉన్నారు, ఎంతమంది ఎన్జీఓలు వారితో పనిచేస్తున్నారనేది చాలా స్పష్టంగా ఉంటుంది. ఎవరో చేసిన స్టడీ ఆధారంగా టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిందని కోట్ చేశారు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో కూడా ఒక ప్రాంతం పేరు చెప్పలేదు, రాష్ట్రం గురించి మొత్తం చెప్పారు. కానీ వీళ్లు రాజకీయ కారణాలతో దాన్ని వాడుకుని ఒక ప్రాంత మహిళలను అవమానించడం చాలా తప్పు" అని శైలజ అన్నారు. ప్రభుత్వాలు గానీ, ఎన్జీఓలు గానీ ఎవరైనా సరే, ఇంగ్లీషులో 'ప్రాస్టిట్యూట్స్' అనో, తెలుగులో 'వేశ్యలు' అనో ఎక్కడా వాడరని, 'సెక్స్ వర్కర్స్' అనే పదాన్నే ఉపయోగిస్తారని శైలజ స్పష్టం చేశారు. "అలాంటిది, మహిళలు, పిల్లలు చూసే ఒక పబ్లిక్ ఛానల్‌లో ఆ పదం వాడారంటే అది ఎంత అవమానకరం? అమరావతి ప్రాంత ఆడవాళ్లు ఏం పాపం చేశారు? ప్రభుత్వం అడిగితే రాజధాని కోసం భూములిచ్చారు, త్యాగం చేశారు. ఆ త్యాగానికి ప్రతిఫలంగా గత ఐదేళ్లలో వాళ్లు రోడ్లెక్కారు, పోలీస్ స్టేషన్ల చుట్టూ, మహిళా కమిషన్ చుట్టూ తిరిగారు. ఎక్కడా న్యాయం జరగలేదు. ఇప్పుడు ప్రభుత్వాలు మారి, అమరావతి అభివృద్ధి దిశగా అడుగులేస్తుంటే ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేసి, ఎవరూ వాడని మాటలతో వాళ్లను కన్నీళ్లు పెట్టేలా చేశారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో మాట్లాడినా కొన్ని సెక్షన్లు వర్తిస్తాయని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే శిక్ష పడదని అనుకోవద్దని ఆమె హెచ్చరించారు. "మీడియా చాలా బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రజల పక్షాన నిలవాలి, ప్రభుత్వంలోని మంచి చెడులను ప్రజలకు చేరవేయాలి. అలా కాకుండా రాజకీయ నాయకుల నీడలో నడిచే ఛానళ్లు సమాజానికి చాలా ప్రమాదకరం. గతంలో రైతులను 'పెయిడ్ ఆర్టిస్టులు' అని కొన్ని మీడియా ఛానళ్లు అంటే, ఆ రైతులే నా మీదకు దాడికి వచ్చారంటూ ఒక జర్నలిస్ట్ రైతులపై కేసు పెట్టారు. రెచ్చగొట్టడం ఎందుకు, మళ్లీ వాళ్లపై కేసులు పెట్టడం ఎందుకు? పొరపాటు జరిగిందని చెప్పాలి కదా" అని శైలజ ప్రశ్నించారు.

ఈ విషయంలో ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేశారని, డీజీపీకి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. "ఇది మళ్లీ పునరావృతం కాకుండా జాతీయ మహిళా కమిషన్‌కు కూడా లేఖ రాశాను. వాళ్లు కూడా దీన్ని సుమోటోగా తీసుకుని, కేంద్ర ప్రభుత్వానికి లేదా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు రాసి, ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలని కోరాను. అధికారాలను దుర్వినియోగం చేయకూడదు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు రాసి, మీడియా ఛానల్ అండ చూసుకుని ఇష్టమొచ్చినట్టు మాట్లాడేవారిపై, అవసరమైతే ఆ ఛానళ్లను మూసివేసే అధికారం కూడా ప్రెస్ కౌన్సిల్‌కు ఉంది, చర్యలు తీసుకోమని మేం సూచిస్తాం" అని శైలజ వివరించారు. మహిళా కమిషన్‌కు నేరుగా అరెస్ట్ చేసే అధికారాలు లేవని, చట్ట ప్రకారం ఎస్పీ లేదా డీజీపీకి చర్యలు తీసుకోమని చెప్పగలమని అన్నారు. "మాకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా లేదా సుమోటోగా కేసు తీసుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని, ఫిర్యాదుదారులను పిలిపించి విచారించే అధికారం మాకుంది. ఏ ఉద్దేశంతో ఆ మాటలు అన్నారో, వారి దగ్గర ఉన్న ఆధారాలు ఏమిటో తెలుసుకుంటాం. వారు చెప్పిన దాంతో మేము సంతృప్తి చెందకపోతే, ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో చేశారని తేలితే, శిక్షార్హులని సంబంధిత అధికారులకు తెలియజేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం ఈ కేసులో రెండో వ్యక్తికి, అలాగే సాక్షి మీడియా యాజమాన్యానికి, చీఫ్ ఎడిటర్‌కు సమన్లు సిద్ధమవుతున్నాయని శైలజ వెల్లడించారు. "నిజంగా మహిళల గురించి అంత కన్సర్న్ ఉంటే, 'మా ఛానల్ తప్పు చేసింది, క్షమాపణ కోరుతున్నాం' అని ఒక మాట చెప్పొచ్చు కదా? అది చేయకుండా, అసలు విషయం నుంచి దృష్టి మళ్లించడానికి ఇప్పుడు బయటకొచ్చి మాట్లాడుతున్నారు" అని ఆమె విమర్శించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని, ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకూడదని ఆమె స్పష్టం చేశారు.

## అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఎపి : వైఎస్.జగన్

ఆయన ఉద్యోగాన్ని ఊడగొట్టాడరని.. ఆయన నిష్పక్షపాతంగా డిబేట్లు చేయడం తట్టుకోలేక 2014-19 మధ్య ఆ ఛానల్‌పై ఆంక్షలు విధించారన్నారు. ఇప్పుడు కూడా తనకు మద్దతుగా లేరన్న కారణంతో ఆయా ఛానళ్లను నియంత్రిస్తూ కక్షసాధిస్తున్నారని ఆరోపించారు. కొమ్మినేని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నానని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబుకు ప్రజలు ఇచ్చిన అధికారం ఐదేళ్లేనని.. అందులో ఏడాది గడిచిపోయిందని.. నాలుగేళ్ల తర్వాత చంద్రబాబు చేసిన అన్యాయాలు, అక్రమాలు, అధికార దుర్వినియోగానికి ప్రజలకు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. చేసిన తప్పులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. " చెడు సంప్రదాయాలకు నాందిపలుకుతూ ఇవాళ ఏది విత్తుతారో.. రేపు అదే పండుతుందని.. అది రెండింతలవుతుందని మర్చిపోకండి " అంటూ సోషల్ మీడియా వేదికగా జగన్ హెచ్చరించారు.

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు అస్వస్థత...

భూమా సొంత గ్రామమైన దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మ జాతరను అట్టహాసంగా గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఆ జాతరలో ఆమె పాల్గొన్నారు. జాతరలో ఆమె పాల్గొనడంతో అందరి వెంబడి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఒక్కసారిగా ఆమె సొమ్మసిల్లి కింద పడిపోయారు. వెంటనే భూమా అఖిల ప్రియను ఆళ్లగడ్డ లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు. గత రెండు రోజులుగా ఉపవాసం ఉండటంతో ఈ సంఘటన జరిగిందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. భర్త భార్గవ్ రాముడు, తమ్ముడు జగన్ విఖ్యాత్ రెడ్డిలు ఆసుపత్రిలో ఆమె వెంటే ఉన్నారు. ఆమె బంధువులు, అభిమానులు ఆమె ఆరోగ్యంగా, సురక్షితంగా రావాలని కోరుకుంటున్నారు

## అడవుల పెంపకానికి కొత్త సలహాదారుడిగా అంకారావు !

ప్రకృతిని పరిరక్షిస్తున్నారు. తన పొలంలో పంట పంచుకుంటూ, "పక్షులు ఉంటేనే అడవి, అడవి ఉంటేనే వాన" అనే నమ్మకంతో జీవిస్తున్నారు. అడవిలో మొక్కల ఔషధ గుణాలు, పర్యావరణ విద్యను పిల్లలకు బోధిస్తూ "వన మూలికా నిపుణుడు"గా గుర్తింపు పొందారు. అయితే, ప్రపంచపర్యావరణ దినోత్సవం (జూన్ 5, 2025) సందర్భంగా అమరావతిలో ఏర్పాటయిన కార్యక్రమంలో పాల్గొన్న అంకారావు తన ప్రసంగం సీఎం చంద్రబాబును ఆకట్టుకున్నాడు. అడవుల అంతరించిపోవడాన్ని, ప్రకృతికి, పువ్వులు వికసించడానికి మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ వేదికపై అనర్గళంగా ఉపన్యాసాలు ఇస్తున్న అంకారావు వైపు సీఎం చంద్రబాబు ప్రశంసాపూర్వకంగా చూశారు. అంకారావు ను అదే వేదికపై రాష్ట్ర ప్రభుత్వ అడవుల పరిరక్షణ సలహాదారుగా నియమించారు.

## చల్లటి కబురు .. నేటి నుండి వానలు

మొదటి అల్పపీడన, ఆ తర్వాత 14 న రెండో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం సాయంత్రం ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. పలు చోట్ల ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. నిన్నటిరోజున అనకాపల్లిలో ఎక్కువగా 5 సెం.మీ వర్షపాతం నమోదయింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండలో 2.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.

# విమానం ఎక్కుతూ తూలిపడిన ట్రంప్.. నెటిజన్ల ట్రోలింగ్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త తడబాటుకు గురయ్యారు. విమానం మెట్లు ఎక్కుతూ తూలిపడ్డారు. ఈ దృశ్యాలను షేర్ చేస్తూ.. నెటిజన్లు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్)ను గుర్తుచేస్తున్నారు. అసలేమయ్యిందంటే.. న్యూజెర్సీలోని మోరిస్టౌన్‌లోని మోరిస్టౌన్ మున్సిపల్ విమానాశ్రయం నుంచి బయలుదేరే సమయంలో ట్రంప్ విమానం మెట్లు ఎక్కుతూ.. మెట్లపై పొరపాటున తూలిపడ్డారు. అయితే ట్రంప్ తర్వాత అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో సైతం తూలిపడటం గమనార్హం.

ఈ దృశ్యాలను నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. గతంలో బైడెన్ విమానం ఎక్కుతూ తూలిపడటంతో ఆయన విమానం కూడా ఎక్కలేకపోతున్నారని ట్రంప్ ఎగతాళి చేయడాన్ని గుర్తు చేస్తూ వరుస పోస్టులు పెట్టారు. ఇప్పుడు ట్రంప్ స్థానంలో బైడెన్ ఉండి ఉంటే ఇప్పటికే టీవీ ఛానళ్లలో బ్రేకింగ్ న్యూస్ వచ్చేది అంటూ ఓ నెటిజన్ చమత్కరించారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. ట్రంప్ మెట్లు కూడా ఎక్కలేకపోతున్నాడు కాబట్టి అధ్యక్ష స్థానానికి అనర్హుడు అని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరో నెటిజన్ స్పందిస్తూ.."గతంలో బైడెన్ ఇదేవిధంగా తూలిపడినప్పుడు ఆయన వీడియోను రోజులతరబడి పదేపదే ప్రదర్శించిన ట్రంప్ మీడియాలు ఇప్పుడు నిశ్శబ్దంగా ఎందుకున్నాయో" అంటూ రాసుకొచ్చాడు.

2021లో జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఓ కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి వెళ్లేందుకు విమానం వద్దకు వచ్చారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం మెట్లు ఎక్కే క్రమంలో వరుసగా మూడుసార్లు జారిపడ్డారు. 2024లోను ఇదేవిధంగా విమానం ఎక్కుతూ తూలిపడ్డారు. దాంతో బైడెన్‌కు వృద్ధాప్య సమస్యలు తీవ్రమవుతున్నాయని.. జ్ఞాపకశక్తి కూడా క్షీణించిందని అప్పట్లో ట్రంప్ విమర్శలు గుప్పించారు. అటువంటి వ్యక్తి అమెరికాను ఎలా ముందుకు తీసుకెళ్లగలరని ప్రశ్నిస్తూ ఎగతాళి చేశారు.

# ఉక్రెయిన్‌పై 479 డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా

## యుద్ధంలోనే అతిపెద్ద డ్రోన్ దాడి



తమ వాయుసేన స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేసిన నాటి నుంచి రష్యా మరింత కఠినంగా స్పందిస్తోంది. తాజాగా ఈ మూడేళ్ల యుద్ధంలో ఎన్నడూ లేనంతగా.. 479 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఈ విషయాన్ని కీవ్ వాయుసేన ధ్రువీకరించింది. దీంతోపాటు 20 క్షిపణలను కూడా తమ దేశంపై ప్రయోగించినట్లు పేర్కొంది. మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లో ప్రదేశాలను ఇవి లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించింది.

మాస్కో ప్రయోగించిన వాటిల్లో 277 డ్రోన్లు, 19 క్షిపణులను మార్గం మధ్యలోనే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మొత్తంలో కేవలం 10 డ్రోన్లు లేదా క్షిపణులు మాత్రమే లక్ష్యాలను తాకినట్లు వెల్లడించింది.

సాధారణంగా రష్యా డ్రోన్ దాడులు సాయంత్రం మొదలై.. తెల్లవారే వరకు కొనసాగుతాయి. చీకట్లో చాలా వరకు యూఏవీలను గుర్తించడం కష్టం కావడంతో.. ఈ వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇటీవల మాస్కో పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకొంటున్నట్లు విమర్శలున్నాయి. ఇప్పటి వరకు రష్యా దాడుల్లో 12,000 మంది ఉక్రెయిన్ వాసులు ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు రష్యా మాత్రం తాము కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతోంది.

### రష్యా నేవీ సరికొత్త వ్యూహం..

రష్యా నౌకాదళం కోసం సరికొత్త వ్యూహాన్ని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ ఆమోదించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ దళంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యమని క్రెమ్లిన్ ప్రతినిధి నికోలాయ్ పత్రుషేవ్ వెల్లడించారు. ఈ ప్లాన్ గురించి మరే వివరాలను ఆయన వెల్లడించలేదు.

చైనా, అమెరికా తర్వాత మూడో అతిపెద్ద నేవీ రష్యా వద్దే ఉంది. కానీ, ఇటీవల ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో దానికి తీవ్ర స్థాయిలో ఎదురు దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం మాస్కో వద్ద 79 జలాంతర్గాములున్నాయి. వీటిల్లో 14 అణుశక్తితో పనిచేస్తాయి. ఇక 222 యుద్ధ నౌకలు కూడా ఆ దేశ అమ్ముల పొదిలో ఉన్నాయి.

తాజాగా పుతిన్ ఆమోదించిన వ్యూహం ప్రకారం 2050 నాటికి రష్యా నౌకాదళాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇక మరోవైపు చైనా నౌకాదళం వేగంగా ఎదుగుతోందని అమెరికా రక్షణశాఖ నివేదిక పేర్కొంది. 2030 నాటికి దాని వద్ద 460 నౌకలు ఉంటాయని పేర్కొంది.

# గాజా వెళ్తుండగా.. ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ కిడ్నాప్..?



మానవతా సాయంతో గాజాకు బయల్దేరిన పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌ను ఇజ్రాయెల్ దళాలు అడ్డుకున్నాయి. ఆమెతో పాటు మరికొందరు హక్కుల కార్యకర్తలు ప్రయాణిస్తున్న నౌకను ఐడీఎఫ్ కమాండోలు చుట్టుముట్టారు. తమను ఇజ్రాయెల్ దళాలు కిడ్నాప్ చేశాయంటూ గ్రెటా థన్‌బర్గ్ ఆరోపించారు. ఈమేరకు ఇన్‌స్టాలో ఓ వీడియో విడుదల చేశారు. ఫ్రీడం ఫ్లోటిల్లా సభ్యులతో కలిసి గాజా వెళ్తుండగా తమను అడ్డుకొని బంధించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజం తమకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్రిటిష్ జెండాతో ఉన్న ఈ నౌక పేరు మడ్లీన్. పాలస్తీనా అనుకూల ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయలేషన్ అనే సంస్థ చేపట్టిన మిషన్‌లో భాగంగా దీన్ని నిర్వహిస్తోంది. ఈ నౌకలో గ్రెటా థన్‌బర్గ్, మెంబర్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంట్ రీమా హసన్‌తో పాటు మొత్తం 12 మంది ఉన్నారు. వీరంతా గాజా పౌరుల కోసం ఆహారం, బేబీ ఫార్ములా తీసుకుని జూన్ 6న సిసిలీ ప్రాంతం నుంచి బయల్దేరారు. ఈ సాయంత్రానికి గాజా స్ట్రిప్ చేరుకోవాల్సి ఉండగా.. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ ఆర్మీ అంతర్జాతీయ జలాల్లో వీరిని అడ్డుకుంది. అనంతరం నౌకను ఇజ్రాయెల్ పోర్టుకు మళ్లించాయి. అయితే, గాజా నలువైపులా ఆంక్షలు ఉండటంతో వీరి నౌకను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. దీనిపై ఇజ్రాయెల్ విదేశీ మంత్రిత్వ శాఖ స్పందించింది. అది మానవతా సాయం అందించడం కోసం వస్తోన్న నౌక కాదని, కేవలం సెలబ్రిటీల 'సెల్ఫీ' యాత్ర అని ఆరోపించింది. అందులో ఆహార పదార్థాలు కూడా చాలా తక్కువ మొత్తంలోనే ఉన్నాయని పేర్కొంది.

# రగులుతున్న లాస్ ఏంజెలెస్..

## రణరంగంలా వీధులు..!



అమెరికాలోని అందాల నగరం లాస్ ఏంజెలెస్ వలసదారుల ఆందోళనలు.. దాడులతో రణరంగంలా మారింది. సిటీలోని వాణిజ్య ప్రాంతమైన డౌన్‌టౌన్‌లో ఎవరూ గుమికూడ వద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ భద్రతా దళాలు ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో ఓ రిపోర్టర్‌కు రబ్బరు తూటా తగిలింది. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) విభాగానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న 2,000 మంది ఆందోళనకారులు డౌన్‌టౌన్‌లోని ప్రధాన హైవేను తమ అధీనంలోకి తీసుకొన్నారు. ఇక్కడ సెల్ఫ్‌డ్రైవింగ్ కార్లకు వారు నిప్పు పెట్టారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో 101 ఫ్రీవేను ఆందోళనకారులు అడ్డుకొ న్నారు. దీంతో అధికారులు ఆ మార్గాన్ని మూసేశారు. ఆందోళనకారులు పోలీసులపై రకరకాల వస్తువులు విసిరి దాడికి యత్నించారు. చాలా పోలీసు వాహనాలు తగలపెట్టారు. పసిఫిక్ సముద్రం పక్క నుంచి ఈ మార్గం దాదాపు 1500 మైళ్లు ప్రయాణిస్తుంది.

### ట్రంప్ చర్యలకు మస్క్ మద్దతు..!

గత కొన్నాళ్లుగా ట్రంప్‌నకు బద్ధవిరోధిలా ప్రవర్తిస్తున్న మస్క్.. తాజాగా లాస్ ఏంజెలెస్ నేషనల్ గార్డ్‌లను రంగంలోకి దింపాలనే ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించడం విశేషం. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టాడు. కాలిఫోర్నియా గవర్నర్, లాస్ ఏంజెలెస్ మేయర్‌లు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ట్రంప్ చేసిన పోస్టు స్క్రీన్ షాట్‌ను షేర్ చేశాడు. దీంతోపాటు జేడీ వాన్స్ పోస్టులను కూడా రీపోస్టు చేశాడు.

### మాస్కుల్లో ఉంటే అరెస్టు చేయండి..

లాస్ ఏంజెలెస్‌లో మాస్కుల్లో ఉన్న ఆందోళనకారులను అరెస్టు చేయాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జరిగిన ఆందోళనల్లో మాస్కుల వినియోగాన్ని ఆయన నిషేధించారు.

### రాజకీయ దుమారం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లాస్ ఏంజెలెస్ స్థానిక నాయకత్వం మధ్య ఘర్షణ కూడా పెరుగుతోంది. తాజాగా ఆ నగర మేయర్ కరెన్ బాస్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళనలు జరగాలన్నారు. ఇక ట్రంప్ వ్యవహార శైలిని తప్పుపట్టారు. "లాస్ ఏజెంలెస్‌లోని పరిస్థితిని రెచ్చగొట్టింది పాలకవర్గమే. పని ప్రాంగణాలు వంటి వాటిపై దాడులు నిర్వహించి తల్లిదండ్రులు, పిల్లలను వేధిస్తే.. సాయుధ బలగాలతో వీధుల్లో కవాతు చేయించి.. మీరు ప్రజల్లో భయం, ఆందోళన సృష్టిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ నగరంలో ఆందోళనలను అణిచివేయాలని 2,000 మంది నేషనల్ గార్డ్స్‌ను ట్రంప్ కార్యవర్గం సిద్ధం చేసింది. ఇప్పటికే 300 మంది ఆ నగరానికి చేరుకొన్నారు. "ఒకప్పుడు అమెరికాలో గొప్ప నగరమైన లాస్ ఏంజెలెస్‌ను అక్రమ వలసదారులు క్రిమినల్స్ ఆక్రమించుకొన్నారు" అని సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 10 జూన్ 2025

# షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు





**పోలవరం, జూన్ 9 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలంలో కచేరి గ్రామంలో ఉన్న సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్ నందు 2024-2025 సంవత్సరానికి గాను ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచి ఆరుగురు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికవ్వడం గర్వకారణం అని పోలవరంసెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తెరిస్సా తెలిపారు. ఏలూరు అధికారుల చేతుల మీదుగాఅవార్డులు ప్రధానంజరుగుతుందని అన్నారు. 585 మార్కులతో మండలంలో మన్విత మొదటి ర్యాంకును తమ స్కూలు విద్యార్థి కైవసం చేసుకుందని అన్నారు. షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్ ఆరుగురు విద్యార్థులు ఏలూరులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులు మీదుగా అవార్డులు తీసుకున్నారు.

# శ్రీచైతన్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు




**చింతలపూడి, జూన్ 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** మార్చి నెలలో జరిగిన 2024-2025 పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన స్థానిక చింతలపూడి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు వి. హర్షిత రాణి, సిహెచ్ .గాయత్రి, ఎం .సంధ్య, జే .వేదశ్రీ ఎస్ .ఎస్. సి 2025 షైనింగ్ స్టార్స్ పేరిట స్థానిక సార్ సీఆర్ రెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తదితర నాయకులు చేతుల మీదుగా ఒక్కొక్కరు 20000 రూపాయలు చెక్కు ప్రశంసా పత్రాలు, పతకాలతో సత్కరించబడింది. శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయపరంపరను మరోసారి చాటి చెప్పారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎమ్. వరలక్ష్మి ప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం పార్థసారధి, రీజినల్ ఇంచార్జ్ ఉదయభాస్కర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏవో రవీంద్ర ,అకాడమిక్ డీన్ ఎన్ చెన్నకేశవ, సి బ్యాచ్ ఇంచార్జ్ మధు తదితరులు విద్యార్థులను తల్లిదండ్రులను అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న విద్యా సంవత్సరంలో మరింత ఉత్తేజంతో కష్టపడి పని చేయాలని ఆకాంక్షించారు.

# అన్నదాత సుఖీభవ పథకం అందించాలి



**చింతలపూడి, జూన్ 9 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** రైతులకు, భూమి లేని కౌలు రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత. కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులు భాగంగా సోమవారం చింతలపూడి తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ప్రమద్వరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కౌలు రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల పంట విత్తనాలు అందించాలని ప్రతి ఏడాది పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఐదు లక్షల వరకు పంట రుణాలు అందించాలని గ్రామసభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్కే.కాలేశా, కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం

## - రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు-జిల్లా మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం, జూన్ 9(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్చార్జి %ఒ% జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు పేర్కొన్నారు.తూర్పు గోదావరి జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం శ్రీ త్యాగరాజు నారాయణ సేవా దాస సమితి హాల్ లో వేడుకగా జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డా. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం ఏర్పడిన వాటి నుంచి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. విద్యారంగానికి అత్యధికంగా నిధులను మంజూరు చేస్తూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందని చెప్పారు. విద్య ఆస్తి లాగా వారసత్వం గా రాదని, శ్రద్ధ తో నేర్చుకోవాలని చెప్పారు. పంచే కొద్దీ పెరిగేది విద్య మాత్రమే నని, అది మన నుంచి ఎవరూ దొంగిలించలేని ఒక అమూల్యమైన సంపదని ఆయన అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 5,088 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 169 మందికి షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఉన్నత విద్య కోసం పొరుగు రాష్ట్రాలకు మన విద్యార్థులు తరలి వెళ్లే వారిని, ఈ పరిస్థితిని నివారించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకేసారి 300 ఇంజనీరింగ్ కళాశాలలు ప్రారంభించారని చెప్పారు. సైబరాబాద్ ను సాఫ్ట్వేర్ కు పర్యాయపదంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందని చెప్పారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ ప్రతి విషయంలో దూరదృష్టి తో వ్యవహరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అందించిన ధర కంటే తక్కువ ధరకే నాణ్యమైన విద్యాసామాగ్రి అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కూడా చేస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నామని తెలియజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే దిశలో జిల్లాలోని 19 మండలాల్లో, మండలానికి ఆరుగురు చొప్పున విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు అవార్డుతో పాటు 20 వేల నగదు పారితోషకము, మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తున్నామని తెలియజేశారు. విద్యా రంగంలో జిల్లా 23వ స్థానం నుంచి ఆరవ స్థానానికి చేరుకుందని, ఇది విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి రాజకీయ నాయకులు స్ఫూర్తి పొందాలని చెప్పారు.విద్యార్థులు అవార్డులు పొందిన తరహాలోనే ప్రజాసేవలో తమకి ప్రతిభ పురస్కారాలు దక్కాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్య తో పాటు క్రమశిక్షణతో మెలగాలని అప్పుడే వారు ఉన్నత స్థానంలో నిలుస్తారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి చదువే ఏకైక లక్ష్యంగా ఉండాలని అన్నారు. "హార్డ్ వర్క్" కాదు "స్మార్ట్ వర్క్" కావాలి అనే నినాదంతో ప్రతి రంగంలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసే విధంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఆయన తెలియజేశారు. సాధారణ విద్యకు కాలం చెల్లిందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. రెండు బిలియన్ల క్వాంటం ఎకానమీని, 5వేల నైపుణ్య ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు ఆదర్శమని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోది అమరావతి పర్యటనలో చెప్పారని గుర్తు చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం పై (కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ) దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అనువైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా 23వ స్థానంలో ఉంటే ఈ సంవత్సరం ఆరవ స్థానంలో నిలిచిందని, ఇది చాలా గొప్ప విషయం అని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానం, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం వలన డ్రాప్ అవుట్స్ ఉండటాన్ని గమనించామని, ఈ పరిస్థితి చక్కదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను ఒకచోటకు చేర్చి షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ప్రతి విద్యార్థి ఈ విజయ పరంపరను, కొనసాగించాలని అప్పుడే వారు అనుకొన్న లక్ష్యాలను చేరుకోగలుగుతారని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటిని పేపర్ పై వ్రాసుకోవటమే కాక, లక్ష్యానికి అవసరమైన కృషి, క్రమశిక్షణ, హార్డ్ వర్క్ తోడైతేనే వాటిని ని సాధించడం వీలవుతుందని అన్నారు.తాము సాధించిన విజయాల ద్వారా తమ జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టే విధంగా కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాల్లో కి వెళ్లిన తరువాత తాము పుట్టిన ఊరుని, తన తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలని వారి అభ్యున్నతికి పాటుపడాలని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది మహనీయులు ఈరోజు గొప్ప స్థానంలో ఉన్నారని, దీనిని ప్రతి విద్యార్థి గమనించి ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను, అవకాశాలను అందిపుచ్చుకొని వారి ఎదుగుదలకు బాటలు వేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ కఠోర శ్రమ, క్రమశిక్షణ విజయానికి అత్యంత అవసరమని చెప్పారు. అనేక రకాలైన ఉద్యోగ అవకాశాలు, వృత్తులు ఉన్నాయని వాటిపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. యు పి ఎస్ సి పరీక్షలలో వచ్చే ప్రశ్నలు అత్యంత కఠినంగా ఉంటాయి అనేది అపోహని, శరీరంలో రక్తం ఏ రంగులో ఉంటుంది అనే ప్రశ్న యుపిఎస్సి లో అడిగితే మనకు సమాధానం తెలిసినా ఎరుపు నిజం కాదేమో, ఇంత సులభమైనది ఇవ్వరు కదా అని వేరే సమాధానం ఎంచుకుంటామని, ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే నేపథ్యంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చినట్లు చెప్పారు. విద్యార్థులకు ఆదర్శవంతమైన భావాలను నేర్పే దిశలో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్, మధ్యాహ్నం భోజనం పథకానికి శ్రీమతి డొక్కా సీతమ్మ పేర్లను పెట్టినట్లు చెప్పారు.. ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థులు, పుట్టిన ఊరు, కన్న తల్లిదండ్రులను మర్చిపోకుండా కృతజ్ఞత భావంతో ఉండాలని ఆయన తెలియజేశారు.అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ దెబ్బతిందని చెప్పారు. "ఒక చెడ్డ వ్యక్తి చేయకూడని పనులు చేస్తూ, జీవితంలో ఒక మంచి గుణపాఠం నేర్పుతాడని" ఆల్బర్ట్ ఐన్స్టీన్ అన్నమాటలు గత ప్రభుత్వానికి సరిపోతాయని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని అందిపుచ్చుకునే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. ఇకనుంచి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ చెప్పిన విషయాన్ని రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... పదవ తరగతి ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా 23వ స్థానం నుంచి ఆరవ స్థానానికి ఎదగడం అభినందినీయమని అన్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలల్లో 90 శాతానికి పైగా ఫలితాలు వచ్చాయని, కానీ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఇంకా పరిస్థితి మెరుగుపడాలని అన్నారు. రాజమహేంద్రవరం గ్రామీణ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తాము విద్యనభ్యసించే సమయంలో పాఠశాలలు, నల్లబల్లలు లేవని చెప్పారు. 1985లో ఎన్టీఆర్ ఆశ్రమ పాఠశాలు ఏర్పాటు చేశారని చెప్పారు. కేంద్ర సర్వీసులలో తెలుగువారి శాతం తక్కువగా ఉందని, అఖిల భారత సర్వీసులో తెలుగు విద్యార్థులు చేరాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలల్లో చేరి డబ్బు వృధా చేసుకోవద్దని హితవు చెప్పారు.శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేసిన ఘనత నాటి ప్రధాని వాజ్ పేయికి దక్కుతుందని చెప్పారు. ఆయన హయాంలో లో రాష్ట్రంలో 45 వేల పాఠశాలల్లో ఒకేసారి పేరెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించారని, ఏకరూప దుస్తులు (యూనిఫామ్), మధ్యాహ్న భోజనం తో పాటు కంప్యూటర్ విద్య కూడా ప్రవేశపెట్టారని చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద ఏడాదికి 3500 కోట్లు చొప్పున 2000 సంవత్సరం నుంచి నేటి వరకు 75 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నారని చెప్పారు. అవార్డులు పొందిన వారు విద్యా అంబాసిడర్లుగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ మాట్లాడుతూ విద్యలో స్పర్ధ, వ్యాపారంలో వైరం ఉండాలని అన్నారు. విద్య ద్వారా సమానత్వం వస్తుందని చెప్పారు. నిడదవోలు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని భావన సీఈసీ లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించిందని, అవార్డు గ్రహీతల్లో అమ్మాయిలు అధికంగా ఉన్నారని చెప్పారు. తొలుత మా తెలుగు తల్లికి మల్లెపూదండ ప్రార్థన గీతం ఆలపిస్తూ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కూడిపూడి సత్తిబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, రాజమండ్రి రెవిన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణా నాయక్, కొవ్వూరు డివిజనల్ అధికారిణి ఆర్. సుస్మిత, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావు, పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి. నాగమణి, అవార్డు గ్రహీత విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్న మేరి జ్యోత్స్న




**అంబాజీపేట, జూన్ 9 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జయంతి నగర్ కు చెందిన వల్లూరి మేరీ జ్యోత్స్నను రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారం వరించింది. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటర్మీడియట్ ఎంపిహెచ్ డబ్ల్యు కోర్సులో 980 మార్కులు పొందారు. అత్యంత సాధారణ కుటుంబానికి చెందిన జ్యోత్స్న చదువుల్లో రాణించడం పట్ల ఆమె తల్లిదండ్రులు ఎంతగానో ఆనందిస్తున్నారు. తండ్రి వల్లూరి లక్ష్మీనారాయణ ఒక సాధారణ శ్రామికుడు. చదువులో రాణిస్తున్న జ్యోత్స్న ను పలువురు స్థానిక నాయకులు అభినందించారు.

# ప్రతిభ పురస్కారానికి బేతని విద్యార్థులు




**కాట్రేనికోన , జూన్ 9 ( తెలుగు రాష్ట్రం విలేకరి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ప్రతిష్టాత్మకమైన ప్రతిభా పురస్కారం 2025 అవార్డులకు ఉప్పూడి బేతని స్కూల్ కి చెందిన మట్టపర్తి లక్ష్మి, కొప్పాడి జ్యోతి, పోలిశెట్టి ప్రణతి ఎంపికైనట్లు బెతని స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఎలిజబెత్ రాణి తెలిపారు. ఈనెల 9వ తారీకు అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్ లో జరిపిన ఈ వేడుకలో జిల్లా కలెక్టర్ డాక్టర్. రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ వివరించారు. విజేతలను బేతని స్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రకృతి ఆరోగ్య కేంద్రం ప్రారంభం




**జగ్గయ్యపేట, జూన్ 9 (తెలుగురాష్ట్రం విలేకరి)** జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండల కేంద్రంలో సిద్ధార్థ ప్రకృతి ఆరోగ్య కేంద్రంను ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అనారోగ్య పరిస్థితులు ఏర్పడటానికి కారణం ఆహారపు అలవాట్లేనని అన్నారు. ఆహారపు నియమ నిబంధనను పాటించకుండా మూడు పూటల భోజనం చేయటం ప్రజలకు అలవాటుగా మారిందని. ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపాలి అంటే ఆహారపు అలవాట్లలో మార్పులు రావాలని కానీ అవి ఎవరు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయం మనందరికీ తెలుసు కానీ ఆరోగ్యం కోసం ఎలాంటి ప్రయత్నం చేయటం లేదన్నారు. వత్సవాయి మండల కేంద్రంలో ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కళ్యాణ మండపంలో మరొకసారి సభ నిర్వహించి పెద్ద ఎత్తున ఈ వైద్య విధానంపై ఆహ్వానం కల్పించేందుకు ప్రయత్నం చేద్దామని అందులో తన సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఇంత గొప్ప వైద్యాన్ని ఈ ప్రజలకు అందించడానికి వచ్చిన డాక్టర్ పి.సి.వి. స్వామి కి వారి బృందానికి అభినందనలు తెలిపారు. డాక్టర్ పి.సి.వి. స్వామి మాట్లాడుతూ ప్రకృతికి దూరంగా ఉండటం వలన, ఆహారపు అలవాట్ల వలన మనుషులంతా అనారోగ్య భారీపడుతున్నారన్నారు. ప్రకృతి పైన జీవించే జంతువులకు మాత్రమే ఏ రోగాలు రావటం లేదు. కానీ ప్రకృతికి దూరమైన మనుషులకు మాత్రం అనేక రోగాలు వస్తున్నాయన్నారు. మనుషులు తప్ప మిగిలిన జీవులన్నీ కుక్క, పిల్లి, కోడి తదితర పక్షులు జంతు జీవులు ఆయుష్ ప్రకారమే జీవిస్తున్నాయని తెలిపారు. ఆహారపు అలవాట్లలో ప్రధానంగా మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ఆరోగ్య కేంద్రం ద్వారా మంచి అందించడం జరుగుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఈ వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలంతా ఆక్యుపంచర్, నేచరోపతి వైద్యాన్ని ఆదరించాలని కోరారు. ప్రకృతి ఆరోగ్య కేంద్రం హైదరాబాద్ నిర్వాహకులు, నేచురోపతి ఆక్యుపంచర్ డాక్టర్ మాట్లాడుతూ సమాజమంతా అనారోగ్యంతో విలవిలలాడుతుందని తెలిపారు. తమ నేచురుపతి ఆక్యుఫంక్షన్ వైద్య విధానంతో అనేక మందికి ఆరోగ్యాన్ని అందించామని తెలిపారు. ఆహారపు అలవాట్లలో మార్పులు తెస్తూ వైద్యాన్ని అందించడమే ప్రకృతి ఆరోగ్య కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యం. ఆరోగ్యాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని 40 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు నిర్వహించామన్నారు. అంతేకాకుండా హైదరాబాద్, ఖమ్మం, ఇల్లందు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించామన్నారు. ఆక్యుపెన్సర్ అండ్ కైరో థెరపిస్ట్ ఎల్. వెంకన్న మాట్లాడుతూ మానసికంగా ప్రశాంతంగా ఉంటూ, శారీరకంగా బలంగా ఉంటూ సమాజంతో మంచి సంబంధాలు కలిగి ఉండటమే ఆరోగ్యమని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పటమే తప్ప ఆరోగ్యంగా ఉండటం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వలన రోగాల బారిన పడి కార్పొరేట్ హాస్పిటల్లో లక్షలను ఖర్చు పెడుతూ మానసికంగా ఆర్థికంగా ప్రజలు చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచభూతాల ధర్మాలను పాటిస్తూ అందించే ఆక్యూపక్షర్ వైద్యాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. ఖమ్మం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన్ మాట్లాడుతూ ఆకుపంచర్ విధానం అద్భుతమైందని అన్నారు. ఆక్యుపంక్చర్ విధానం ద్వారా ఒక వ్యక్తికి సయాటిక తగ్గిన విషయాన్ని ఆయన వివరించారు. ఇంకా ఈ సభలో పలువురు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు

తెలుగురాష్ట్రం దినపత్రిక
ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
అమలాపురం
జూన్ 10,
మంగళవారం 2025



# దళిత యువకులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్9 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర హెూం మంత్రి అనితకు రాజ్యాంగం గూర్చి తెలుసుకోవాలని సిపిఐ సిపిఎం జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, టి. అరుణ్ విమర్శించారు. సోమవారం స్థానిక గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన దళిత మైనారిటీ యువకులపై పోలీసులు నడిరోడ్డుపై దాడి చేయడానికి నిరసిస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముందుగా తాటిపాక మధు, టి. అరుణ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ అనేక మంది దళితులపై దాడులు చేశారని ఒక యువకున్ని హత్య చేసి డోర్ డెలివరీ కూడా చేశారని దీన్ని పై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమం జరిగిందని జగన్ ప్రభుత్వాన్ని ఓడించి చంద్రబాబు ప్రభుత్వానికి ఓట్లు వేచి అధికారం ఇచ్చారని వారు అన్నారు. ప్రభుత్వాలు మారిన దళితులకు రక్షణ లేదని ఈ ఘటన ద్వారా రుజువు అవుతుందని వారు తెలిపారు. ముగ్గురు యువకులు నిజంగా గంజాయి తాగి తప్పు చేసి ఉంటే దానికి చట్టం ఉందని అరెస్టు చేసి రిమాండ్ కి పంపాలని, అంతే కాకుండా ఆ చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుని బహిరంగంగా కొట్టడం ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ఘటనను ఖండించవలసింది పోయి పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర హెూం మంత్రి అనిత బహిరంగంగా నిసిగ్గుగా సమర్ధించుకోవడం ఆక్షేపనియం అన్నారు. ఎవరైనా నేరం చేస్తే కోర్టుకు అప్పచెప్పాలని తగిన శిక్ష విధించాలని దానికి ఒక ప్రొసీజర్ కోడ్ ఉందని, కానీ బహిరంగంగా నడిరోడ్డుపై దళిత యువకులను బూటు కాలుతో తొక్కి దారుణంగా కొట్టడం దుర్మార్గం అన్నారు. దీనిపై ఇప్పటివరకు రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం చాలా అన్యాయం అన్నారు. అమరావతి మహిళలపై విమర్శలు రాగానే స్పందించిన ముఖ్యమంత్రి దళితులపై దాడులు జరుగుతున్న మాట్లాడరా అని ప్రశ్నించారు. ఉద్యోగాలు లేక ఉపాధి లేక యువత పెడదారు పడుతున్నారని వారికి ఉపాధి ఉద్యోగాలు కల్పిస్తే ఎటువంటి తప్పుదారి పట్టారని వారు అన్నారు. దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, జంగం సుబ్బారావు, ఎస్. విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని చట్టాలను గౌరవించాలని వారు అన్నారు. మానవ హక్కుల సంఘాలు సుప్రీంకోర్టు పోలీస్టేషన్లోనే కొట్టకూడదని చెప్తుంటే వీరు నడిరోడ్డుపై కొట్టడం అంటే రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని వారు అన్నారు. న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్లో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే తెనాలి ఎస్సైను సీఐను సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఇంటర్సిటీ కింద అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉగ్రగతం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, సిపిఎం జిల్లా నాయకులు బి.పవన్, పూర్ణిమరాజు, న్యూ డెమోక్రసీ నాయకులు కే.సత్తిబాబు, వి.చిట్టిబాబు, సిపిఐ నాయకులు పి.లావణ్య, కె.శ్రీనివాస్, టీ.నాగేశ్వరరావు, పి.త్రిమూర్తులు, నల్ల రామారావు, రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరరావు, దుర్గమ్మ, దేవుడు బాబు, వెంకటరావు మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు కొండావతి, శారద పోలమ్మ తదితరులు పాల్గొన్నారు

# జూలై 4న పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణసభ

## -మాజీ ఎంపీ హర్షకుమార్



**రాజమహేంద్రవరం, జూన్ 9(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణసభ జూలై 4 న నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ చెప్పారు. ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదు హత్య అని నమ్మే ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా హాజరుకావాలని ఆయన కోరారు. రాజీవ్ గాంధి కళాశాల సమావేశం మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రమాదం అయితే పాస్టర్ ప్రవీణ్ పగడాల ఇంటినుంచి ఐప్యాడ్, ల్యాప్ టాప్ ఎందుకు తీసుకువెళ్ళారని ప్రశ్నించారు. కోర్టు సూచనల మేరకు పోలీసులు ఎటువంటి ఇబ్బందులూ, ఆటంకాలు కల్పించకుండా సభకు అనుమతి ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని హర్షకుమార్ విమర్శించారు. ఏడాది అయినప్పటికీ ఒక్క గ్యాస్ సిలిండర్ తప్ప మరే పథకం అమలు చేయలేదని, ఇది ప్రజలను మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు. దళితులపై దాడులు పెరిగాయని, ఎదిరించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీకి 45 రోజుల గడువు ఇవ్వకుండా నెల రోజులు ఇచ్చారని, సహేతుకంగా లేని ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కారణంగా డీఎస్సీ జరగదని ప్రభుత్వానికి తెలుసని ఆయన అన్నారుపోలవరం పూర్తి కాకుండా బనకచర్ల ప్రాజెక్టు చేపట్టవద్దని హర్షకుమార్ డిమాండ్ చేశారు. రూ.82 వేల కోట్ల ఈ ప్రాజెక్టు సీఎం చంద్రబాబు కమీషన్ల కోసమే చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. రాజధాని అమరావతిపై తప్పుగా మాట్లాడిన వాడిని రాజధాని మహిళలు చెప్పుతో కొట్టాలని హర్షకుమార్ సూచించారు. ఎవడో ఎదవ ఏదో అన్నాడని ఆందోళన చేయడం కాదు, వారికి సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. అయితే రాజధాని కోసం మరో 40 వేల ఎకరాలు కావాలని అడుగుతున్న చంద్రబాబును ఇంకా భూ సమీకరణ ఎందుకని మహిళా రైతులు ప్రశ్నించాలని హర్షకుమార్ కోరారు.

# రాజకీయ కనుసైగలో పోలీస్ అరాచకాలు

## -మేడా శ్రీనివాస్ ఆందోళన



**రాజమహేంద్రవరం సిటీ, జూన్9 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** నేర రహిత ఆంధ్రప్రదేశ్ ను సాధిద్దాం కదలి రండి అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ యువతకు పిలుపునిచ్చారు. భారతదేశంలోనే అత్యంత విలువైన విద్యార్హత గల యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఉత్తీర్నులై ఐఏఎస్ – ఐపిఎస్ వంటి అత్యున్నత హెూదాలను సాధించి ప్రజలకు, సమాజానికి సేవలు చేయకుండా రాజకీయ అధికారులకు , అవినీతి సంపదకు బానిసలుగా మారి పోవటం బాదాకరం అన్నారు. “ఐఏఎస్ – ఐపిఎస్ హెూదాలు భారతదేశంలోనే అతి విలువైన గౌరవ ప్రదమైనవి. అవినీతి సంపదకు , కొన్ని సొంత బలహీనతలకు బానిసలుగా మారి ఆ గౌరవ హెూదాలకు మకిలి పట్టిస్తున్నారు. వారు తలచుకుంటే నిజాయితీతో పాటుగా మంచి ప్రభుత్వ జీతం, ఇతర సౌకర్యాలు నిత్యం అధికారికంగా అందుబాటులో ఉంటాయి. వందలు, వేల కోట్ల అవినీతి సంపదకు వ్యసన పరులుగా మారి అధికార రాజకీయ పక్షాలకు అధికార దుర్వినియోగంతో ఊడిగం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారి నప్పుడల్లా ఊడిగం చేసిన ఐఏఎస్ – ఐపిఎస్ లపై కేసులు, విచారణలతో జైళ్లకు వెళ్ళటం తప్పటం లేదు . ఎందుకొచ్చిన ఖర్మ వీరికి ఏ రాజకీయ నాయకుడుకు లేనటువంటి హెూదా, అధికారం వీరి సొంతం. కష్టపడి శ్రమించి సాధించుకున్నది అని మరిచిపోయి అవినీతి సామ్రాజ్యానికి చక్రవర్తులుగా మారుతున్నారు. ఐదు ఏళ్లు అనంతరం ఖైదీలుగా మారుతున్నారు. ఈ తంతు యావత్ భారతదేశంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో మరి ఎక్కువగా కొనసాగుతుంది” అని ఆయన తీవ్ర ఆవేదన చెందారు. “బాధితులు పిర్యాదుకు స్పందిస్తే చాలు అనుకుంటున్నారు. నేడు తప్పు చేస్తున్న నేరస్తులు కన్నా బాధితుడు పోలీస్ స్టేషన్ కు వెళ్ళటానికి భయపడే పరిస్థితులే ఎక్కువగా వుంటున్నాయి. చట్ట బద్ధమైన హక్కుతో నేడు బాధితులు రక్షణ పొందలేక పోతున్నారు. నిజాయితీగా విధులు నిర్వహించ లేని పోలీస్ యంత్రాంగం. రక్షణ కల్పించలేని రక్షణాలయాలు ఎవరి కోసం ఎందు కోసం అని ప్రజలు కుమిలి పోతున్నారని ఆయన పాలకులను ప్రశ్నించారు. పోలీస్ శాఖ పనితీరు ఒక విధంగా వుంటే రెవిన్యూ శాఖ పనితీరు మరో విధంగా వుంటుందని, రైతులు, భూ స్వాములు రెవిన్యూ శాఖ పనితీరుకు బేంబేలెత్తి పోతున్నారు. రెవిన్యూ అధికార నేరాలకు అంతు లేకుండా పోతుంది. రెవిన్యూ శాఖలో అత్యధిక శాతం అధికార దుర్వినియోగ నేరాలే కొనసాగుతున్నాయి అనటంలో సందేహం లేదు. రెవిన్యూ నేరాలకు కొంతమంది డిప్యుటీ తహసీల్దార్, తహసీల్దార్ హెూదాలో భూ నేరగాళ్ళతో సత్సంబంధాలు కొనసాగిస్తు రెవిన్యూ నేరాలకు ఒక యూనివర్సిటీ స్థాయి శిక్షణలు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో మత్తు ప్రధార్ధాల సరఫరా విస్తృతంగా జరుగుతుంది. సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తు యువత భవిష్యత్ ను సర్వ నాశనం చేస్తున్నారు. నేర రహిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలను అభివృద్ధి పరచుకోవటానికి యువత నడుం బిగించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సిమ్మా దుర్గారావు , ఎమ్ డి హుస్సేన్, దుడ్డే సురేష్ , వాడపల్లి జ్యోతిష్ , కారుమూరి యుగంధర్, ఆకుల మణికాంత్ , సుంకర వెంకట భాస్కర రంగారావు, చల్లా సాంబశివరావు, వాకాటి అచ్యుతరావు, చల్లా అఖిల్, వాకాటి బాల ఆదిత్య నాగేంద్ర, చల్లా వంశీ, అడపా శేషగిరి, మాసా అప్పాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సాల్మన్ సెంటర్ లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహణ





**చీరాల రూరల్, జూన్ 9 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** 11వ అంతర్జాతీయ యోగా ఆంధ్ర దినోత్సవం పురస్కరించుకొనిచీరాల శాసనసభ్యులు మద్దులూరు మాలకొండయ్య గల ఆదేశాల మేరకు బాపట్ల జల్లా చీరాల మండలంలో సాల్మన్ సెంటర్ పంచాయతీ లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ ఉద్యోగులు సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు సాల్మన్ సెంటర్ టిడిపి అధ్యక్షులు రాజా, సెక్రెటరీ నాయిబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే గిడ్డి



**పి.గన్నవరం, జూన్ 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జిల్లా విద్యాశాక అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ మహేష్ కుమార్ తో పాటు శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు అందజేయడం ద్వారా విద్యార్థులపై తన ప్రీతిని మరియు ప్రోత్సాహాన్ని వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వం ప్రతిభను గుర్తించి ప్రతి మండలానికి ఆరుగురు విద్యార్థులు చొప్పున ఎంపిక చేసి వారికి రూ.20,000 నగదు మరియు ప్రశంసా పత్రం బహుమతులు అందించడమే కాకుండా విద్యను ప్రోత్సహించే దిశగా కీలకమైన ముందడుగు వేసింది. ఈ కార్యక్రమం విద్యార్థుల మనోబలాన్ని పెంపొందించడమే కాకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమాజానికీ గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా అవార్డు పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.

# ప్రతి జిల్లా కేంద్రంలో కాపు సామాజిక భవనం ఏర్పాటు చేయాలి

## -కాపునాడు ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్



**రాజమహేంద్రవరం, జూన్9 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాపు సామాజిక భవనాలు ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందచేసినట్లు కాపునాడు ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ చెప్పారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎంను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. రాజమండ్రిలో కాపు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని తమ సంఘం తరుపున రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, రాజమండ్రి సిటీ రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలకు విజ్ఞప్తి చేశామని, ఈ భవనానికి 30 సెంట్ల స్థలం కేటాయించే విషయంలో దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి కీలక పాత్ర పోషించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సాధ్యమైనంత త్వరగా రాజమండ్రి సమీపంలోని బొమ్మూరులో కాపు సామాజిక భవనం నిర్మాణం పూర్తి చేయించాలని గుదే రఘు నరేష్ కోరారు. తమ కాపునాడు సంఘం దేశంలోని 15 రాష్ట్రాల్లో విస్తరించి ఉందని,విజయవాడలో రెండు చోట్ల కాపు విద్యా భవన్ ఉన్నట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో కాపునాడు రాజమండ్రి పార్లమెంటు అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, రాజమండ్రి రూరల్ అధ్యక్షుడు దేశినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడు కాళ్ళ చక్రరావు, మహిళా విభాగం కార్యదర్శి జి.విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు మేడిశెట్టి పద్మ, రాజమండ్రి నగర ప్రధాన కార్యదర్శి పుర్లింకల సతీష్, రూరల్ కార్యదర్శి పసలపూడి నారాయణ, రాజానగరం కార్యదర్శి సలాది నాయుడు, నగర ఉపాధ్యక్షుడు మర్రి దుర్గా ప్రసాద్, లాలాచెరువు అధ్యక్షుడు కుంపట్ల రామకృష్ణ, కార్మిక విభాగం అధ్యక్షుడు సిమాద్రి నాగభూషణం, నగర కార్యదర్శి ర్యాలి రామకృష్ణ, యువజన విభాగం ఉపాధ్యక్షుడు కోరుమిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానం





**చీరాల, జూన్ 9 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** పాపాయిపాలెం గ్రామంలో శ్రీ కృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుంది. ఈ సందర్భంగా సోమవారం ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం చేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో పోరాట స్ఫూర్తిని నింపుతాయన్నారు. శారీరక ,మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, క్రీడాకారులు,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం



**ఎటపాక, జూన్ 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** లక్ష్మీపురం గ్రామంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం సోమవారం లక్ష్మీపురంలో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు తదితరులు ప్రతిరోజు యోగ ఆరోగ్యానికి ఎంతో మేలని నినాదాలు చేయడం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కణితి మధు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి వెంకన్న, ఉండేటి రమేష్, జనసేన మండల ఉపాధ్యక్షులు మొల సతీష్, పంచాయతీ గ్రీ అంబాసిడర్స్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# గిరిజన భూమి పండుగకు సంప్రదాయ చరిత్ర

## -ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జీలుగుమిల్లి, జూన్ 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** బర్రింకలపాడు గ్రామంలో జరుగుతున్న గిరిజన సాంప్రదాయ భూమి పండుగ వేడుకలో సోమవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. దేవతను దర్శించుకున్న ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు. ఎన్నో ఏళ్లగా సాంప్రదాయ పద్దతిలో ప్రతి ఏటా జరుపుతున్న భూమి పండుగ కు ఒక చరిత్ర తో కూడిన ప్రత్యేకత ఉందన్నారు.మే నెల వరకు భూమి కి నీరు లేక జూన్ నెల వర్షాలతో భూమి చల్లబడి నాటిన విత్తనాలు మొలకెత్తి రైతులకు ఏ నష్టం వాటిల్లకుండా చూడాలని ఆ దేవతను కొలుస్తూ సాంప్రదాయ నృత్యాలు,పాటలతో సంతోషం గా పిల్లా పాపలతో చేసుకొనే పండుగా అని అన్నారు.ఈ పండుగ ఏజన్సీ ప్రాంతానికి ఒక పెద్ద ప్రతీక గా గిరిజన సంప్రదాయాన్ని చాటి చెప్పే చిహ్నం గా ఉంటుందన్నారు.

# ‘యోగంధ్రా’ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు




**జీలుగుమిల్లి, జూన్ 9 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సోమవారం ‘యోగాంధ్ర’ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. జీలుగుమిల్లి ప్రధాన కూడలి నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు యోగా కు సంబందించిన స్లోగన్లతో ర్యాలీ సాగింది. ఈ ర్యాలీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. నేటి మానవాళికి యోగా చాలా ముఖ్యమని యోగా చేయటం వలన మానవ శరీరంలో అన్ని అవయవాలు సమృద్ధిగా పని చేస్తాయని, దీనితో మనిషి ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించడంతో పాటు మానసిక ప్రశాంతత కలిగి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపిపి కొర్సా పోశమ్మ, తాటియాకులగూడెం సర్పంచ్ వనమా రాంబాబు, అంకంపాలెం ఎంపిటిసి నాలి శ్రీను,కూటమి నాయకులు సరిపల్లి సత్యనారాయణ రాజు, గంధ వెంకటేశ్వరరావు, అధికారులు తహసీల్దార్ ఉదయ్ నాయక్, ఎంపిడివో నిఖిల్, ఎస్ ఐ బి.వెంకటేశవరావు, మిగిలిన శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ కాంస్య విగ్రహ ఆవిష్కరణ



**జగ్గయ్యపేట, జూన్ 9 (తెలుగురాష్ట్రం విలేకరి):** సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని చత్రపతి శివాజీ కమిటీ సభ్యులతో కలిసి ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆవిష్కరించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు స్వామినేని ఉదయభాను, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా జగ్గయ్యపేట పట్టణంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నెలకొల్పడం చాలా శుభపరిణామని ఊరి మొదటిలో శివాజీ మహారాజ్ విగ్రహం ప్రజలందరినీ తను కాపాడుతానని ఒక చిహ్నంగా ఉంటుందని పెద్దలు అన్నారు. శివాజీ మహారాజ్ తన పాలనలో హిందూ స్వరాజ్యాన్ని స్థాపించి, మరాఠా ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించారని అన్నారు. భారతదేశ చరిత్రలో ఒక ఆదర్శవంతమైన పాలకుడిగా, అసమానమైన వ్యూహకర్తగా చిరస్మరణీయుడు అని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ భారతదేశ చరిత్రలో గొప్ప రాజులలో ఒకరు అని, ఆయన కేవలం యుద్ధతంత్రాలలోనే కాకుండా, పరిపాలనా విధానంలో కూడా గొప్ప సంస్కర్త అన్నారు. శివాజీ ప్రజల పాలకుడిగా వ్యవహరించాడు. ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. వ్యక్తిగత విలాసాలకు దూరంగా ఉంటూ, ప్రజల శ్రేయస్సు కోసమే కృషి చేశారని, సరళమైన, సమర్థవంతమైన పాలన కొనసాగించాడు అని అన్నారు. శౌర్యానికి ప్రతిరూపం ఛత్రపతి శివాజీ మహారాజ్ అని చక్రవర్తులను ఎదిరించి పోరాడిన మరాఠా ఛత్రపతి శివాజీ మాతృభూమిపై శివాజీకున్న మక్కువ, ఆయనలోని దేశభక్తి, శత్రువు ఎంతటి బలవంతులనైన ఎదిరించి పోరాడే ఆత్మ స్థైర్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జీవితన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

# కల్వర్టు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు

## -ప్రశ్నించిన ఎమ్మెల్యే అమిలినేని



**కళ్యాణదుర్గం, జూన్ 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** కళ్యాణ్ దుర్గం నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న కల్వర్టు ఎందుకు ఆలస్యం అవుతుంది. ప్రజలు వాహనదారులు ఎంత ఇబ్బందులు పడుతున్నారు మీకు కనిపించడం లేదా అని సంబంధిత డిఈపై కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం చేసే వారికి అవసరమైతే నోటీసులు జారీ చేయండి. వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేస్తామని డిఈ ఎమ్మెల్యేకు తెలిపారు.

# బోనిగల ప్రకాష్‌కి నివాళులర్పించిన వెంకటేష్



**చీరాల, జూన్ 9(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** బాపట్ల జిల్లా చీరాలలో 13వ వార్డులో నివాసం ఉంటున్న కరణం వారి అభిమాని బొనిగల ప్రకాష్ ఇటీవల మరణించారు. చీరాల వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ ఆ అభిమాని నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ప్రకాష్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వెంకటేష్ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ హొదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# గజవల్లి షణ్ముఖ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



**చీరాల, జూన్ 9 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** నియోజవర్గ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు మనవడు జై షణ్ముఖ పుట్టినరోజు వేడుకలను శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ప్రాంగణంలో జరిగాయి. గజవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం ప్రజలకి ఎంతో వైభవంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి వారి దీవెనలు పొందుతూ ఉన్నామని తెలిపారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దీవెనలు మాతోపాటు చీరాల నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు కోరుకున్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.కోటి 15 లక్షలు





**జగ్గయ్యపేట, జూన్ 9 (తెలుగురాష్ట్రం విలేకరి):** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు సోమవారం హుండీ లెక్కింపు జరిగినది. 75 రోజులకు గాను శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సాధారణ ఖాతా ద్వారా 1,15,34,525/- రాగా, మిశ్రమ బంగారం-0.98 గ్రాములు, మిశ్రమ వెండి-1.50 గ్రాములు వచ్చింది అని, విదేశీ కరెన్సీ అమెరికా-51, కెనడ-100, మలేసియా-1, ఇంగ్లండ్- 5, థాయిలాండ్- 20 వచ్చాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రకటన చేశారు. ఈ హుండీ లెక్కింపులో డిప్యూటీ కమిషనర్, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్ కుమార్, జూపూడి గ్రూపు టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి బి. రవీంద్రబాబు, పాలకమండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), పాలకమండలి సభ్యులు, దేవస్థాన సిబ్బంది, శ్రీ దుర్గ శివ సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

**ముమ్మిడివరం, జూన్ 9 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**




ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా అవసరమని ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని మంచి ఆరోగ్య ఆహార అలవాట్లు ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కొత్తలంక గ్రామ పెద్దలు పేర్కొన్నారు. సోమవారం కొత్తలంక గ్రామపంచాయతీ పరిధిలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తోలేటి రాంబాబు, నడిమింటి సూర్య ప్రభాకరం, దాసరి సుమలత సాయిబాబా, గీసాల దుర్గ చంద్రరావు, దూడలస్వామి, గుత్తుల మల్లికార్జున రావు బీరశివ,పంచాయతీ కార్యదర్శితో పాటు, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, కొత్తలంక ప్రజలు పాల్గొన్నారు.

# రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి




**చీరాల, జూన్ 9(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఆంధ్రుల రాజధాని అమరావతి, రాజధాని కోసం భూములు ఇచ్చిన మహిళలని వేశ్యాలని, సాక్షి టీవీ డిబేట్లో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులు బహిరంగంగా అమరావతి మహిళా రైతుల పైన నీచమైన పదజాలంతో యావత్తు మహిళ ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా మాట్లాడిన వీరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఇకపై మరెవరు ఈ విధమైనటువంటి వ్యాఖ్యలు చేయకుండా వీరిపై కఠినమైన చర్య తీసుకోవాల్సిందిగా వేటపాలెం పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెం అంజమ్మ , వడ్డెర మహిళలు మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


# నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం

## -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, జూన్ 9 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే సుందరమైన నగరాన్ని ప్రజలు చూస్తారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 42వ డివిజన్ ఎల్ బి శాస్త్రి మార్గంలో రూ. 35 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంఖుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ఏ ప్రాంతంలో చూసినా ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజల ఆలోచనలకు తగ్గట్టు వారికి ఏ అభివృద్ధి కావాలో ఆ పనులు మాత్రమే చేయడం జరుగుతోందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగరాభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తున్నామన్నారు. రాజమండ్రి సిటీలో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రోడ్లు కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జెఎన్ రోడ్డు వంటి ప్రధాన మార్గాల్లోనే అవసరం లేక పోయినా డివైడర్లు, ఫుట్ పాత్ లు నిర్మించారని మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పదకొండు నెలల్లో తాము మార్పు చేసి చూపించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. రాజమండ్రి నగర ప్రజల 15 ఏళ్ళ కల సాకారం చేసేందుకు గోదావరి గట్టున రివర్ ఫ్రంట్ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలోని 35 పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలాగే ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా గ్రీన్ రాజమండ్రి - ఆరోగ్య రాజమండ్రిని ప్రజలు త్వరలోనే చూస్తారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పార్కుల అభివృద్ధి పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాజమండ్రి చరిత్ర భవిష్యత్తులో నిలిచిపోయేలా కూటమి అభివృద్ధి పనులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాశి నవీన్ కుమార్, డివిజన్ ఇంచార్జ్ మళ్ల వెంకట రాజు, కెవి శ్రీనివాస్, సావిత్రి, వానపల్లి శ్రీనివాస్, కొండబాబు, మహబూబ్ ఖాన్, సలాది ఆనంద్, జవ్వాది మురళి, పాలవలస భద్రం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గాయాల పాలైన జన సైనికుడుకి చెక్కును అందించిన జనసేన అధ్యక్షులు శ్రీనివాస్






**రాజమహేంద్రవరం సిటీ, జూన్9 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** జనసేన క్రియాశీలక సభ్యుడు పోలాకి లక్ష్మీనారాయణ ఇటీవల బైపాస్ రోడ్ లో ఆటో ప్రమాదానికి గురై గాయాలు పాలయ్యారు. లక్ష్మీనారాయణ జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడంతో ఇన్సూరెన్స్ కవరేజ్ చెక్ 29400/- ను జనసేన పార్టీ రాజమహేంద్రవరం అధ్యక్షులు వై. శ్రీనివాస్ చేతుల మీదుగా లక్ష్మీనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలక సభ్యత్వం చేసిన విక్టరీ వాసు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై గూటికి శాంసన్..?

## ఒక్క పోస్ట్‌తో సోషల్ మీడియాలో రచ్చో, రచ్చ..

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ, అప్పుడే జట్ల మార్పులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి మారబోతున్నాడనే వార్త సోషల్ మీడియాలో, క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సంజూ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది.**



ఇటీవల సంజూ శాంసన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో సీఎస్‌కే కెప్టెన్ ఎం.ఎస్. ధోనీతో ఉన్న ఒక ఫోటోను పంచుకుని, దానికి “నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి” అనే అర్థం వచ్చేలా ఒక వ్యాఖ్యను జోడించాడు. ఇది సాధారణ పోస్ట్ లాగే అనిపించినప్పటికీ, ఐపీఎల్ జట్ల మార్పుల గురించి చర్చ జరుగుతున్న తరుణంలో రావడంతో అభిమానులు దీనికి వేరే అర్థాలు తీస్తున్నారు. ధోనీ వారసుడిగా సంజూ సీఎస్‌కే పగ్గాలు చేపట్టబోతున్నాడనడానికి ఇది ఒక సంకేతం అని వారు భావిస్తున్నారు.

### సీఎస్‌కేకు సంజూ సరైన ఎంపికా?

మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ నుంచి పూర్తిగా రిటైర్ అయిన తర్వాత, అతని స్థానాన్ని భర్తీ చేయడం సీఎస్‌కే యాజమాన్యానికి అతిపెద్ద సవాలు. సీఎస్‌కేకు కేవలం ఒక వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు, జట్టును ముందుండి నడిపించగల ఒక సమర్థవంతమైన కెప్టెన్ కూడా కావాలి. ఈ రెండు పాత్రలకు సంజూ శాంసన్ సరిగ్గా సరిపోతాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గత కొన్ని సీజన్లుగా రాజస్థాన్ రాయల్స్ జట్టును సంజూ విజయవంతంగా నడిపిస్తున్నాడు. కెప్టెన్‌గా ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండటం, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో అతను పరిణితి కనబరిచాడు. అంతేకాకుండా, ధోనీ అంటే సంజూకు ప్రత్యేకమైన అభిమానం మరియు గౌరవం ఉన్నాయి. ఈ అంశాలన్నీ అతన్ని సీఎస్‌కేకు ఆకర్షణీయమైన ఎంపికగా మారుస్తున్నాయి.

### ఐపీఎల్ 2026 మెగా వేలం కీలకం..

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు మెగా వేలం జరగనుంది. ఈ వేలం నిబంధనల ప్రకారం, జట్లు తమ పాత ఆటగాళ్లలో కేవలం కొద్దిమందిని మాత్రమే అట్టిపెట్టుకోగలవు. మిగిలిన వారందరూ వేలంలోకి వస్తారు. ఒకవేళ రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం సంజూ శాంసన్‌ను రిలీజ్ చేస్తే, అతన్ని దక్కించుకోవడానికి సీఎస్‌కే ఖచ్చితంగా ప్రయత్నిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

### ప్రస్తుతానికి పుకారే..!

సంజూ శాంసన్ జట్టు మార్పుపై వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమే. దీనిపై సంజూ శాంసన్ గానీ, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యాలు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏది ఏమైనప్పటికీ, ధోనీ తర్వాత సీఎస్‌కే పగ్గాలు ఎవరు చేపడతారనే ఆసక్తి, సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లపై ఇలాంటి పుకార్లకు దారితీస్తోంది. మెగా వేలం సమీపించే కొద్దీ ఈ విషయంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కొద్ది రోజుల క్రితం సంజూ శాంసన్ తన భార్యతో కలిసి ఉన్న ఒక ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. దానికి “%ఱఅఎవ ˆశీ వీఉఎఱు%..!!” (మారాల్సిన సమయం వచ్చింది..!!) అని క్యాప్షన్ జోడించాడు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. సాధారణంగా చూస్తే ఇదొక వెకేషన్ ఫోటోలా అనిపించినా, క్రికెట్ అభిమానులు మాత్రం దీని వెనుక ఉన్న గూడార్థాన్ని వెలికితీశారు. ఆ ఫోటోలో, రోడ్డుపై పసుపు రంగు గీత స్పష్టంగా కనిపిస్తోంది. దీన్ని సీఎస్‌కే జెర్సీ రంగుతో ముడిపెడుతూ, సంజూ చెన్నై జట్టులోకి వెళ్తున్నాడని చెప్పకనే చెబుతున్నాడంటూ అభిమానులు విశ్లేషణలు మొదలుపెట్టారు.

### అభిమానుల సందడి.. నిజమేనా?

ఈ పోస్ట్ చూసిన అభిమానులు “సంజూ ఈజ్ కమింగ్ టు సీఎస్‌కే”, “ఎల్లో లవ్‌లో పడ్డాడు”, “ధోనీ వారసుడిగా చెన్నైకి వస్తున్నాడు” అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మహేంద్ర సింగ్ ధోనీ తర్వాత సీఎస్‌కేకు సరైన కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సంజూనే అని చాలామంది అభిప్రాయపడుతున్నారు. రాజస్థాన్ రాయల్స్‌కు ఎన్నో ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ఆ జట్టుతో శాంసన్‌కు విభేదాలు ఉన్నాయనే ప్రచారం కూడా గతంలో జరిగింది. ఈ క్రమంలో తాజా పోస్ట్ జట్టు మార్పు వార్తలకు మరింత బలాన్నిచ్చింది.

### గతంలోనూ చర్చలు.. ఇప్పుడు నిజమవుతాయా?

నిజానికి, సంజూ శాంసన్‌ను తమ జట్టులోకి తీసుకురావడానికి సీఎస్‌కే యాజమాన్యం గతంలోనూ ప్రయత్నాలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత జరిగిన ఒక మ్యాచ్ అనంతరం, సంజూ సీఎస్‌కే యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించడం కనిపించింది. అప్పటి నుంచే ఈ మార్పుపై పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇప్పుడు ఐపీఎల్ 2026 మెగా వేలానికి ముందు సంజూ ఈ పోస్ట్ పెట్టడం వెనుక కచ్చితంగా బలమైన కారణం ఉండే ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే, ఇప్పటివరకు ఈ విషయంపై సంజూ శాంసన్ గానీ, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యాలు గానీ అధికారికంగా స్పందించలేదు. ఇవన్నీ కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం, అభిమానుల ఊహాగానాలే. ఒకవేళ ట్రేడ్ విండో ద్వారా లేదా మెగా వేలంలో ఈ మార్పు జరిగితే, అది ఐపీఎల్ చరిత్రలోనే ఒక అతిపెద్ద సంచలనం అవుతుంది. ఏదేమైనా, ఈ పుకార్లపై స్పష్టత రావాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# సిద్ధూ టీం ఆఫ్ ది సీజన్, సూరీడు లేని జట్టుకు రోహిత్ కెప్టెన్!

IPL 2025 సీజన్ ముగిసిన వెంటనే ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత, భారత మాజీ ఓపెనర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ తన స్వంత “టీం ఆఫ్ ది సీజన్” ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా రోహిత్ శర్మను ఎంపిక చేసిన విషయం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే ఈ సీజన్‌లో రోహిత్ ముంబై ఇండియన్స్ జట్టుకు నాయకత్వం వహించలేదు. అతను 15 మ్యాచ్‌ల్లో 415 పరుగులు చేసినా, ముంబై ఇండియన్స్ క్వాలిఫయర్ 2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. రోహిత్ మాత్రం ముంబై తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండవ ఆటగాడిగా నిలిచాడు. అతని కంటే ఎక్కువగా పరుగులు చేసినవాడు సూర్యకుమార్ యాదవ్ – 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులతో ‘మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్’గా ఎంపికయ్యాడు. అయినా సూర్యకు సిద్ధూ జట్టులో చోటు కలగకపోవడం పై భారీ విమర్శలు వెల్లువెత్తాయి.

సిద్ధూ తన యూట్యూబ్ వీడియోలో రోహిత్‌ను ముంబై రాజుగా అభివర్ణిస్తూ, అతని ఐదు IPL టైటిల్స్, ఒక ఐసీసీ టీ20 వరల్డ్ కప్, ఒక ఛాంపియన్స్ ట్రోఫీ వంటి విజయాలను గుర్తుచేశారు. అయితే అభిమానులు మాత్రం రోహిత్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడాన్ని సమర్థించలేదు. IPL 2025 అధికారిక జట్టులో కూడా అతనికి చోటు లేదు, పైగా ఈ సీజన్ కెప్టెనింగ్ రోల్ కూడా వహించలేదు.

ఈ ప్రైవేట్ జట్టులో మరో ఓపెనర్‌గా విరాట్ కోహ్లీని సిద్ధూ ఎంపిక చేశాడు. ఈ వారం ప్రారంభంలో కోహ్లీ తన తొలి IPL టైటిల్‌ను గెలుచుకుని, 15 ఇన్నింగ్స్‌లలో 657 పరుగులతో సీజన్‌ను ముగించాడు. ఎనిమిది అర్ధ సెంచరీలు సాధించిన అతను స్టేడియంలో తన ప్రతిభను మరోసారి చూపించాడు.



సిద్ధూ జట్టులో మిగతా సభ్యులు కూడా ఆసక్తికరంగా ఉన్నారు. జోస్ బట్లర్, శ్రేయాస్ అయ్యర్, నికోలస్ పూరన్, హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేస్తుండగా, బౌలింగ్ విభాగంలో నూర్ అహ్మద్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఎంపికయ్యాడు. పేస్ డిపార్ట్‌మెంట్‌ను ప్రసిద్ధ్ కృష్ణ, జస్‌ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్ లాంటి అగ్రశ్రేణి బౌలర్లు నడిపించనున్నారు.

ఈ జట్టు ఎంపికపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ జరిగింది. ముఖ్యంగా సూర్యకుమార్ లాంటి అత్యుత్తమ ఆటగాడికి చోటు ఇవ్వకపోవడం, కెప్టెన్‌గా రోహిత్ ఎంపిక, అతని నాయకత్వ పాత్ర లేనిది ఉన్నా సమర్థించడంపై అభిమానులు సిద్ధూను విమర్శిస్తున్నారు. అయినా కూడా, సిద్ధూ తన అభిప్రాయాన్ని అద్భుతమైన తీర్పుగా అభివర్ణిస్తూ, ఆటగాళ్ల గత విజయాలు, అనుభవం ఆధారంగా ఎంపిక చేశానని వెల్లడించారు. %ఖ్రూా% 2025 ముగిసిన తరువాత కూడా ఇలా చర్చల్లో నిలిచిన “సిద్ధూ XI” మరోసారి అభిమానుల ఆగ్రహాన్ని మరియు చర్చనీయాంశాన్ని రేకెత్తించింది.

నవజ్యోత్ సింగ్ సిద్ధూ IPL 2025 జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, జోస్ బట్లర్, శ్రేయాస్ అయ్యర్, నికోలస్ పూరన్, హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా, నూర్ అహ్మద్, ప్రసిద్ధ్ కృష్ణ, జస్ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్

# టీమిండియా షెడ్యూల్‌లో కీలక మార్పులు

## ఆ వేదికను మార్చేసిన బీసీసీఐ



**టీమిండియా స్వదేశీ సిరీస్ షెడ్యూల్‌లో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. దీని ప్రకారం, అక్టోబర్ 2, 2025 నుంచి ప్రారంభమయ్యే వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లోని రెండవ మ్యాచ్‌ను కోల్‌కతాకు బదులుగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా, నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌ను ఢిల్లీకి బదులుగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.**

### చెన్నైలో జరగాల్సిన వన్డే మ్యాచ్ వాయిదా..

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే మహిళల వన్డే సిరీస్ చెన్నైలో జరగబోదని బీసీసీఐ ప్రకటించింది. చండీగఢ్‌లోని న్యూ పీసీఏ స్టేడియం ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుండగా, చివరి వన్డే ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతుంది.

చెన్నైలో జరగాల్సిన మ్యాచ్‌లను మార్చడానికి ప్రధాన కారణం చేపాక్‌లో జరుగుతున్న పనులు. అంటే, చేపాక్ స్టేడియంలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. అందుకే మహిళల వన్డే మ్యాచ్‌లను చెన్నై నుంచి చండీగఢ్‌కు తరలించారు.

# రిటైర్మెంట్ పై మౌనం వీడిన కాటేరమ్మ కొడుకు!

## సెంట్రల్ కాంట్రాక్టే అందుకు కారణమా?

**దక్షిణాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ క్రికెట్‌కి గుడ్‌బై చెప్పడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. సెంట్రల్ కాంట్రాక్టులో తనకు స్థానం దక్కకపోవడమే ప్రధాన కారణమని వెల్లడించిన క్లాసెన్, కుటుంబంతో గడిపేందుకు ఇది సరైన సమయమని పేర్కొన్నాడు. గత కొన్ని నెలలుగా మానసికంగా ఒత్తిడిలో ఉన్న క్లాసెన్, కోచ్ వాల్టర్‌తో చర్చల తర్వాత ఈ నిర్ణయానికి వచ్చాడు. ICC టోర్నీల్లో మెరిసిన ఈ ప్లేయర్ రిటైర్మెంట్ వార్త అభిమానుల్ని నిరాశపరిచినా, ఆయన నిర్ణయానికి గౌరవం వ్యక్తమవుతోంది.**



దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తన రిటైర్మెంట్ ప్రకటించడం ద్వారా క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. ఇటీవల టెస్ట్ క్రికెట్ నుంచి షాక్ రిటైర్మెంట్ ప్రకటించిన క్లాసెన్, ఇప్పుడు అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రోటీస్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆయన, క్రికెట్ సౌత్ ఆఫ్రికా కేంద్ర ఒప్పందంలో తనకు స్థానం లేకపోవడాన్ని చూసి నిరాశ చెందాడు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వెల్లడిస్తూ, క్లాసెన్ తన మనసిక స్థితి గురించి బహిరంగంగా వెల్లడించాడు. అతని ప్రకారం, జట్టు విజయాలపై ఆసక్తి లేకుండా, తన ప్రదర్శన పట్ల కూడా ఏమాత్రం పట్టించుకోని పరిస్థితికి అతను చేరాడని, ఇది తనకు సరైన స్థలం కాదని తెలిపాడు.

ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్‌తో నిర్వహించిన సుదీర్ఘ చర్చలలో తన ఆత్మస్థితి పై స్పష్టత వచ్చింది అని క్లాసెన్ వెల్లడించాడు. మొదట 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆడాలని అభిలషించినా, వాల్టర్ పదవీ విరమణతో పాటు CSAతో ఒప్పంద చర్చలు ఆశించిన దిశగా జరగకపోవడం వల్ల తన నిర్ణయాన్ని తీసుకోవడం చాలా తేలికైందని చెప్పారు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం తన కుటుంబంతో సమయం గడపాలని అతని ప్రధాన కోరికగా క్లాసెన్ పేర్కొన్నాడు. “ఇప్పుడు నేను ఆరు, ఏడు నెలలు ఇంట్లో గడపగలను. నా కుటుంబానికి అది అవసరం. గత నాలుగు సంవత్సరాలు ఎక్కువ ప్రయాణాలతో గడిపాను. నాకు కొంచెం విశ్రాంతి అవసరం” అంటూ తన భావాలను వ్యక్తం చేశాడు.

ప్రస్తుతం అతను మేజర్ లీగ్ క్రికెట్, ది హండ్రెడ్ లలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నందున, అతను త్వరలో జరిగే జింబాబ్వే-న్యూజిలాండ్ ట్రై-నేషన్ సిరీస్, ఆస్ట్రేలియా వైట్-బాల్ పర్యటనకు దూరంగా ఉండనున్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో CSAతో ఉన్న చర్చలు విఫలమయ్యాయి. రెండున్నర సంవత్సరాల కుమార్తెకు తండ్రిగా ఉన్న క్లాసెన్, తన కుటుంబంతో సమయం గడపడం కోసం ఆటకు విరామం ఇవ్వడం ఎంత అవసరమో వివరించాడు.

దక్షిణాఫ్రికా తరఫున అన్ని ఫార్మాట్లలో అతను అత్యుత్తమంగా రాణించిన బ్యాటర్‌గా నిలిచాడు. స్పిన్నర్లను ధాటిగా ఎదుర్కొంటూ తన విప్పింగ్ పుల్ షాట్లతో అభిమానులను అలరించిన క్లాసెన్, ఇటీవల జరిగిన ICC పురుషుల వన్డే వరల్డ్ కప్ 2023, టీ20 వరల్డ్ కప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ప్రాతినిధ్యం వహించాడు. అతని రిటైర్మెంట్ నిర్ణయం అభిమానుల్ని నిరాశకు గురిచేసినప్పటికీ, వ్యక్తిగత కారణాల కోసం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల చాలా మంది గౌరవాన్ని వ్యక్తం చేశారు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక




## మళ్లీ మెగాఫోన్ పడుతున్న తరుణ్ భాస్కర్.!

టాలీవుడ్ యువ దర్శకుడు, 'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది', 'కీడా కోలా' వంటి విభిన్న చిత్రాలతో తనదైన ముద్ర వేసిన తరుణ్ భాస్కర్ మళ్లీ మెగాఫోన్ పట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. తన చివరి చిత్రం 'కీడా కోలా' విడుదలై దాదాపు ఏడాదిన్నర తర్వాత తరుణ్ కొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు తరుణ్ భాస్కర్ తన సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. "స్క్రిప్ట్ పూర్తయింది ది ఎండ్" అని రాసి ఉన్న ఒక ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌తో తరుణ్ అభిమానుల్లో ఉత్సాహం నిండింది. అయితే, తరుణ్ తదుపరి చిత్రం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ అవుతుందా, లేక పూర్తిగా కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నారా అనేది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఈ వివరాలు త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉంది.

## సింహం శివుడి రూపంలో..

### 'అఖండ 2' టీజర్‌పై థమన్ అప్‌డేట్



నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీనుల క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'అఖండ 2'. గతంలో రికార్డులు సృష్టించిన 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షుటింగ్ జరుపుకుంటోంది. 'అఖండ' సృష్టించిన సునామీ తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ 2' (అఖండ 2 తాండవం) పై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను విజయవంతంగా చిత్రీకరించింది. అంతేకాకుండా, ఇటీవలే జార్జియాలో కూడా షుటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అయితే నటసింహం రేపు తన పుట్టినరోజును జరుపుకోబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి అప్‌డేట్‌ను పంచుకున్నాడు సంగీత దర్శకుడు థమన్. నేడు సాయంత్రం 6:03 గంటలకు 'సింహం శివుడి రూపంలో' రాబోతుందంటూ అఖండ టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు.

## ఫోటో క్లిక్




## రియలైజేషన్ ప్లాప్ ల్లోనేనా..

## వివాదాల్లో కూడానా?

వైఫల్యాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతాయి. తదుపరి నిర్ణయాల విషయంలో పదిసార్లు ఆలోచించి తీసు కుంటాం. రియలైజేషన్ ప్లాప్ ల్లోనేనా..వివాదాల్లో కూడానా? వైఫల్యాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతాయి. తదుపరి నిర్ణయాల విషయంలో పదిసార్లు ఆలోచించి తీసుకుంటాం. ఇందుకు ఎవరూ అతీతులు కాదు. అందరూ తప్పులు చేసి ఎదిగిన వారే. ఇటీవలే ఇలాంటి రియలైజేషన్ పూజాహెగ్డే మాటల్లో బయటపడింది. టాలీవుడ్ లో కెరీర్ పీక్స్ లో ఉండగా బాలీవుడ్ అవకా శాలు రావడంతో? ఉన్న అవకాశాలను కూడా వదులుకుని హిదీ పరిశ్రమకు వెళ్లిన సంగతి తెలిసిందే. అక్కడా వరుస వైఫల్యాలు ఎదురవ్వడంతో? ఎక్కువ ఆలోచించకుండ మళ్లీ సౌత లో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టి కొన్నింటిని అందుకుంది. సో బ్యూటీఫుల్! ఇప్పుడిప్పుడే మళ్లీ తమిళ్ లో బిజీ అవుతుంది. హిందీలోనూ కొన్ని సినిమాలు చేస్తోంది. ఏదో ఒక సినిమా తో మంచి కంబ్యాక్ ఇస్తుంది అన్న నమ్మకం ఉంది. ఇదే సమయంలో కొన్ని సినిమాల్లో పాత్రల పరంగా తాను తీసుకున్న నిర్ణయాలు రేసులో వెనక్కి నెట్టనట్లుగా రియలైజ్ అయింది. అయితే రియలైజేషన్ కోలీవుడ్, బాలీవుడ్ కే పరిమితమా? టాలీవుడ్ లోనూ అనుసరిస్తుందా? అన్నదే టాపిక్ ఇక్కడ. ఆ మధ్య తెలుగులో ఓ స్టార్ హీరోతో ఓ భారీ బడ్జెట్ సినిమా చేసింది. చిత్రీకరణ మొదలైన దగ్గర నుంచే యూనిట్ తో వివాదాలు మొదలయ్యాయి. కమిట్ అయింది కాబట్టి ఆ సినిమా పూర్తిచేసింది. ప్రచారం మొదలయ్య సరికి మళ్లీ ఆ చిత్ర నిర్మాతలు, హీరోని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ప్రచారానికి సరిగ్గా సహకరిచకుండా ఇబ్బంది పెడుతుందనే అంశం తెరపైకి వచ్చింది. అయితే అదంతా మౌనంగా..రసహ్యంగానే నడిచిది తప్ప తనకు తానుగా బహిర్గతం కాలేదు. ఈ విషయంలో బుట్ట బొమ్మను మెచ్చుకోవాల్సిందే. మనసులో ఉద్దేశం ఎలాంటిదైనా? ఓపెన్ అవ్వలేదు. మరి ఇలాంటి విషయాల పట్ల అమ్మడిలో రియలైజేషన్ కలిగిందా? లేదా? అన్నది తేలాలి. తప్పు ఎవరిది? అన్నది పక్కన బెడితే? తన వైపు నుంచి సినిమాకు ఎంత వరకూ న్యాయం జరిగిందన్నది ఓపెన్ అయితే ఇబ్బందే ముంది. అదే చేయగల్గితే మళ్లీ తెలుగులోనూ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. ఆ కారణంగానే టాలీవుడ్ లో ఛాన్సులు రాలేదు అనే అపవాద నుంచి బయట పడే అవకాశం ఉంటుంది.



## సల్మాన్ ఖాన్ కు చంపేస్తామంటూ బెదిరింపులు



బాలీవుడ్ టాప్ హీరోలైన సల్మాన్ ఖాన్ మరియు షారుఖ్ ఖాన్లకు ఇటీవల అందిన బెదిరింపులు ఇప్పుడు హిందీ సినిమా పరిశ్రమలో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. ఇప్పటికే గతంలోనూ వీరిద్దరికి పలు సార్లు బెదిరింపులు వచ్చినప్పటికీ, తాజాగా మరోసారి పునరావృతం కావడం భద్రతాపరంగా పెద్ద ప్రశ్నలు తీసుకొస్తోంది.

### సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపు?

జూన్ 5న గురువారం రాత్రి ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు ఒక బెదిరింపు సందేశం అందింది. "మై సికిందర్ హూం" అనే పాట రచయితను ప్రస్తావిస్తూ వచ్చిన ఈ సందేశంలో, నటుడు సల్మాన్ ఖాన్ నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. ఈ బెదిరింపు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై వర్లీ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సల్మాన్ ఖాన్‌కు గతంలోనూ పలుమార్లు ఈ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే.

### షారుఖ్ ఖాన్‌కు ఫోన్ ద్వారా ప్రాణహాని బెదిరింపు

ఇక జూన్ 3న, ముంబై బాంద్రా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫోన్ కాల్ ఒక శాక్‌కు గురి చేసింది. ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి, షారుఖ్ ఖాన్‌ను చంపేస్తానని బెదిరించాడు. రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఫోన్ చేసిన వ్యక్తి తనను తాను "హిందుస్థానీ"గా పరిచయం చేసుకున్నాడు. డిమాండ్ చేసిన డబ్బు ఇవ్వకపోతే షారుఖ్ ఖాన్‌ను హతమారుస్తానని హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.

### భద్రత పెంపు పోలీసుల అప్రమత్తత

ఈ కాల్‌ను ట్రేస్ చేయగా, అది ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజాన్ ఖాన్ అనే న్యాయవాది పేరు మీద ఉన్నట్లు తేలింది. అయితే, తన ఫోన్ దొంగిలించబడిందని ఫైజాన్ ఖాన్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ముంబై పోలీసులు అతడిని విచారణ నిమిత్తం పిలిపించారు.

### గతంలో షారుఖ్ ఖాన్ కు బెదిరింపులు

గతంలో షారుఖ్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. ముఖ్యంగా 2023 అక్టోబర్‌లో 'పఠాన్', 'జవాన్' సినిమాల విడుదల సమయంలో వచ్చిన బెదిరింపుల నేపథ్యంలో ఆయన భద్రతను వై-ప్లస్ కేటగిరీకి పెంచారు. ప్రస్తుతం తాజా బెదిరింపుల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. రెండు వేర్వేరు ఘటనలపై లోతుగా దర్యాప్తు జరుపుతున్నట్లు ముంబై పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ వరుస బెదిరింపులతో బాలీవుడ్‌లో భద్రతాపరమైన ఆందోళనలు మళ్లీ తెరపైకి వచ్చాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339